# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 227

VEKUVA SAMAYAM TELUGU DAILY

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy   సంపాదకులు : కె.భాస్కర్‌రావు   రూ.2.00/- పేజీలు 8   తేది: ఆదివారం 20 సెప్టెంబర్ 2026








**సమయం ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాఖలో 11 మండలాలకు చెందిన 28,445 కుటుంబాలకు ఇంటి హక్కు పట్టాలను సీఎం పంపిణీ చేశారు. మొత్తం రూ.8,874 కోట్ల విలువైన భూమికి సంబంధించిన పట్టాలను లబ్ధిదారులకు అందించారు. పేదల ఇళ్ల కోసం ప్రభుత్వం 399 ఎకరాల భూమిని క్రమబద్ధీకరించింది. దశాబ్దాలుగా ఇళ్లపై ఉన్న అనిశ్చితికి ఈ పట్టాలతో ముగింపు పలుకుతున్నామని చంద్రబాబు తెలిపారు. ఇకపై లబ్ధిదారులు తమ ఇళ్లపై పూర్తి హక్కులు కలిగి ఉంటారని చెప్పారు.

**ఇక మీ ఇళ్లపై ఎలాంటి భయం లేదు :** ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. సొంతిల్లు ఉండాలనేది ప్రతి మనిషి కల అని అన్నారు. పేదలకు సొంత ఇళ్లు ఉండాలన్న ఎన్టీఆర్ స్ఫూర్తితోనే తమ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. 'మీరు ఉంటున్న ఇళ్లపై సర్వహక్కులు ఇక నుంచి మీవే. మీ ఇళ్లపై ఎలాంటి వివాదం లేదు.. భయం లేదు' అని చంద్రబాబు అన్నారు. పట్టాలు పొందిన తర్వాత అవసరమైతే ఇళ్లపై బ్యాంకు రుణాలు కూడా తీసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ఇళ్ల హక్కు పత్రాలు అందుకోవడం ద్వారా పేద కుటుంబాలకు ఆస్తిపై భద్రత ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చంద్రబాబు తెలిపారు. పోలవరం ఎడమ కాలువను పూర్తి చేసి అనకాపల్లికి నీటిని అందించడంతో పాటు విశాఖకు గోదావరి జలాలను తీసుకొస్తామని చెప్పారు.




**సమయం ప్రతినిధి:** కేరళం మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఆయన కుమార్తె టీ. వీణ, అల్లుడు.. ఎమ్మెల్యే పీ.ఏ. మహమ్మద్ రియాస్‌పై అవినీతి కేసు నమోదు చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ED) కోరిన అంశం ఇప్పుడు రాష్ట్రంలో హాట్ టాపిక్ అయింది. ఈ అంశంపై కేరళ ప్రభుత్వానికి అడ్వకేట్ జనరల్ (AG) నుంచి లీగల్ ఒపీనియన్ అందిందని రాష్ట్ర హోంమంత్రి రమేష్ చెన్నితల వెల్లడించారు. ఇవాళ (శనివారం) ఆయన పతనం తిట్టలో విలేకరులతో మాట్లాడారు. ఈ వ్యవహారాన్ని పరిశీలించిన తర్వాత, ముఖ్యమంత్రితో సంప్రదించి చట్టప్రకారం తగిన నిర్ణయం తీసుకుంటామని రమేష్ చెన్నితల స్పష్టం చేశారు. 'చట్టపరంగా చేయగలిగినదంతా చేస్తాం' అని ఆయన పేర్కొన్నారు. రాహుల్ గాంధీతో ఈ అంశంపై చర్చించాల్సిన అవసరం లేదని, ఇది కేరళం రాష్ట్ర పరిధిలోనే పరిష్కరించుకోవాల్సిన విషయమని హోంమంత్రి తెలిపారు. కొచిన్ మినరల్స్ అండ్ రూటైల్ లిమిటెడ్ (CMRL) ఆర్థిక లావాదేవీలకు సంబంధించి పీఎమ్ఎల్ఏ (PMLA) కింద ఈడీ విచారణ జరుపుతోంది. ఈ క్రమంలో విజయన్, ఆయన కుమార్తె వీణ, అల్లుడు రియాస్‌లపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసులను ఈడీ లేఖ ద్వారా కోరింది. ఈడీ సోదాల్లో ఎలాంటి అక్రమ సొమ్ము లభించలేదని, కేంద్ర దర్యాప్తు సంస్థ వ్యాప్తి చేస్తున్నవన్నీ అబద్ధాలని మహమ్మద్ రియాస్ తీవ్రంగా మండిపడ్డారు. తన చివరి శ్వాస వరకు ఈడీపై పోరాటం కొనసాగిస్తానని చెప్పారు.




**సమయం ప్రతినిధి:** మధ్యాహ్న భోజన పథకం ద్వారా పిల్లలకు మాంసాహారాన్ని అందించాలని తమిళనాడు ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం వారానికి ఒకసారి ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు చికెన్ బిర్యానీ అందించేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు ఆ రాష్ట్ర సీఎం విజయ్, విద్యాశాఖ మంత్రి రాజ్ మోహన్ కలిసి ప్రణాళికలు రూపొందించారు. ప్రస్తుతం ఈ పథకం ప్రయోగాత్మక దశలో ఉంది. పేద విద్యార్థులకు చికెన్ బిర్యానీ అందించాలనే ఆలోచనతో ఈ పథకానికి శ్రీకారం చుట్టినట్టు రాజ్ మోహన్ తెలిపారు. అయితే ఉన్నపళంగా దీన్ని ప్రవేశపెట్టదలుచుకోలేదని ఆయన చెప్పారు. భద్రత, శుభ్రతలను పాటిస్తూ ఈ పథకాన్ని ఎలా అమలు చేయవచ్చనే అవగాహన కోసం తొలుత ఎంచుకున్న కొన్ని పాఠశాలల్లోనే అమలు చేయాలని నిర్ణయించుకున్నామని ఆయన వివరించారు. జైలు ఖైదీల కోసం కూడా చికెన్ బిర్యానీని వండి వారుస్తున్నప్పుడు.. చిన్నారుల కోసం వండలేమా అని ప్రశ్నించారు.

**జులై నుంచే ప్రణాళిక :** ఈ పథకానికి జులై నుంచే ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలుస్తోంది. పిల్లలకు చికెన్ బిర్యానీ అందించాలనే ఆలోచన రాగానే మంత్రి రాజ్ మోహన్ సీఎం విజయ్‌కు తెలిపారు. ఆయనకూ ఈ ఆలోచన నచ్చడంతో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీని ద్వారా పేద విద్యార్థులకు ప్రొటీన్లతో కూడిన ఆహారం లభిస్తుందని ఆయన భావించారు. కాగా బిర్యానీ ఉన్న రోజు శాకాహారుల కోసం ప్రత్యేక ఆహారం కూడా ఉండేలా పథకం నమూనా తయారైంది. తమిళనాడు ప్రభుత్వం భోజన పథకంపై ప్రత్యేకంగా శ్రద్ధ పెడుతోంది.




**వికసిత్ భారత్ లక్ష్య సాధనలో తెలంగాణ రాష్ట్రం కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతం తెలంగాణ వాటా ఉన్న స్థాయి నుంచి 5 శాతం నుంచి 10 శాతానికి పెంచే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.**

**సమయం ప్రతినిధి :** ఇందుకోసం కేవలం ప్రభుత్వ రుణాలపై ఆధారపడే విధానానికి పరిమితం కాకుండా ప్రైవేట్, సంస్థాగత పెట్టుబడులను పెద్ద ఎత్తున సమీకరించే దిశగా చర్యలు చేపడుతున్నామని వివరించారు. రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలను తీసుకురావడంతో పాటు యువతకు మెరుగైన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణ యువతే రాష్ట్రానికి అతిపెద్ద బలమని, వారి నైపుణ్యాలు, ప్రతిభను వినియోగించుకునేలా ఆర్థికాభివృద్ధి, ఉపాధి రంగాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకూ సమతుల్య అభివృద్ధి ఫలాలు అందేలా CURE-PURE--RARE విధానాన్ని అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. సుమారు 30 వేల ఎకరాల విస్తీర్ణంలో భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయడం ద్వారా భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కొత్త ఆర్థిక, పారిశ్రామిక అవకాశాలను సృష్టించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రైవేట్ పెట్టుబడుల సమీకరణకు మరింత ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు. దేశాభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు కేంద్రం.. రాష్ట్రాలు సహకార సమాఖ్య స్ఫూర్తితో కలిసి పనిచేయాలని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కేంద్రం-రాష్ట్రాల మధ్య సమన్వయం, పెట్టుబడుల ప్రోత్సాహం, యువతకు అవకాశాల కల్పనతో తెలంగాణను వేగవంతమైన ఆర్థికాభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.




**సమయం ప్రతినిధి :** సీఎం రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి కేటీఆర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శలు గుప్పించారు. ఈరోజు(శనివారం) మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి, కేటీఆర్ మధ్య మైత్రి ఏంటో ప్రజలకు తెలుసన్నారు. సర్వే నంబర్లతో సహా చెప్పి కేటీఆర్ బాధపడకుండా ఉండేలా డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. కొత్తగా పొలిటికల్ డ్రామాలు చేస్తూ ఎంపీలు, ఎమ్మెల్సీలను పంపి తమాషాలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. వాళ్లు వెళ్లేది ఎందుకు హద్దులు కొలవడానికా అని ప్రశ్నించారు. ఏఐసీసీకి ముడుపులు ముట్టక సమస్య సైడ్ ట్రాక్ అవుతోందని అన్నారు. ముందు కేసీఆర్ కుటుంబంపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ సుద్దపూస మాటలు ఆపాలని కేంద్ర మంత్రి అన్నారు. పొత్తూర్ లాజిస్టిక్ పార్క్ నడుపుతోంది కేటీఆర్ అని.. కొంతమందితో కలిసి హోటళ్లు, రెస్టారెంట్లు నడుపు తున్నారని తెలిపారు. ఖానాపూర్‌లో టికెట్ మార్చడానికి కారణం ఏంటని ప్రశ్నించారు. ఒకప్పుడు ఆంధ్ర అడ్వాకేట్లు అన్న కేటీఆర్.. ఇప్పుడు వాళ్లతోనే ఎందుకు గడుపుతున్నారని నిలదీశారు. ఈరోజు రోజ్‌గార్ మేళా ద్వారా రెండు వందల మందికిపైగా ఉద్యోగ పట్టాలు ఇచ్చామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలలో నిరుపేద బిడ్డలకు ఉద్యోగాలు ఇచ్చా మన్నారు. ఖైరతాబాద్ ఉపఎన్నిక అనివార్యం అవుతుందన్న కేంద్ర మంత్రి బండి సంజయ్.. ఆ ఎన్నికలో బీజేపీదే విజయమని ధీమా వ్యక్తం చేశారు.




**సమయం ప్రతినిధి :** పశువుల దొంగతనాలు, మొబైల్ షాపుల్లో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను హైదరాబాద్ సిటీ పోలీసులు, టాస్క్‌ఫోర్స్, ఖమ్మం పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో అరెస్ట్ చేశారు. ఈ ముఠాకు చెందిన తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. నిందితుల నుంచి 15 మొబైల్ ఫోన్లు, మూడు కార్లు, రూ.22 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ముఠాలో తబ్రేజ్ ఏ1 నిందితుడిగా ఉన్నాడని, పశువుల దొంగతనాల్లో తబ్రేజ్, రఫిక్ ప్రధాన పాత్ర పోషించారని వెల్లడించారు.

**పండుగల సమయంలో పశువుల చోరీలు :** రంజాన్, బక్రీద్ పండుగల సమయంలో నిందితులు పశువుల దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. నాగర్‌కర్నూల్, ఖమ్మం, మహబూబ్‌నగర్, ఫ్యూచర్ సిటీ ప్రాంతాల్లో ఎక్కువగా పశువులను చోరీ చేసేవారని సీపీ తెలిపారు. పశువులను సులభంగా తరలించేందుకు శఎర్ఖఓఆఅవ అనే మత్తు ఇంజక్షన్‌ను ఉపయోగించి, వాటిని వాహనాల్లో ఎక్కించుకుని తరలించేవారని చెప్పారు. సాయి రెడ్డి అనే వ్యక్తి ఈ ఇంజక్షన్లను సరఫరా చేసేవాడని వెల్లడించారు.

**పశువుల నుంచి మొబైల్ చోరీలకు :** రంజాన్, బక్రీద్ పండుగలు ముగిసిన తర్వాత నిందితులు మొబైల్ ఫోన్ల చోరీలకు పాల్పడటం ప్రారంభించారని పోలీసులు తెలిపారు. తబ్రేజ్, రఫిక్, ఫరహాన్ విజయవాడలోని బిగ్ సీ మొబైల్ షాపులో చోరీకి ప్రయత్నించగా అది విఫలమైంది. అనంతరం జూన్ 11న ఈ ముగ్గురు ఖమ్మంలోని సోనోవిజన్ మొబైల్ షాపులో చోరీకి పాల్పడ్డారని సీపీ తెలిపారు. చోరీ చేసిన మొబైల్ ఫోన్లను మధ్యవర్తుల ద్వారా జావిద్ ఖాన్‌కు సుమారు రూ.20 లక్షలకు విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటన తర్వాత ఖమ్మం పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

## గణేష్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 19 (వేకువ సమయం ప్రతినిధి):** గణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రజలు, ఉత్సవ కమిటీలు అధికారులకు సహకరించాలని ఆమె కోరారు. శనివారం తెలంగాణ చౌరస్తా సమీపంలోని శ్రీ గణేష్ భవన్‌లో జిల్లా గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన మట్టి గణపతి విగ్రహానికి కలెక్టర్ ఖుష్బూ గుప్తా, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు అనుకూలంగా మట్టి గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించడం అభినందనీయమన్నారు. మట్టి గణపతిని ఏర్పాటు చేయడం ద్వారా ఉత్సవ సమితి ప్రజలకు మంచి సందేశాన్ని అందించిందని, ఇది ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

**చిన్న విగ్రహాలకు మూడు కృత్రిమ కుంటలు**

మహబూబ్‌నగర్ నగర పాలక సంస్థ పరిధిలో ఐదు అడుగుల లోపు విగ్రహాల నిమజ్జనం కోసం మూడు కృత్రిమ కుంటలను ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. అప్పన్నపల్లి సమీపంలోని మయూరి పార్క్ ఎదురుగా గంగోస్కుంట వద్ద రెండు, పంచవటి పాఠశాల సమీపంలోని పార్క్ వద్ద ఒక కృత్రిమ కుంటను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

**పెద్ద విగ్రహాల నిమజ్జనానికి బీచుపల్లిలో ఏర్పాట్లు**

పెద్ద గణపతి విగ్రహాల నిమజ్జనానికి కూడా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. గణేష్ ఉత్సవ సమితి సభ్యులతో ఈ అంశంపై చర్చించినట్లు చెప్పారు. బీచుపల్లి వద్ద నిమజ్జనానికి అవసరమైన నీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గద్వాల జిల్లా కలెక్టర్‌తో కూడా మాట్లాడి అవసరమైన ఏర్పాట్లను సమన్వయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని, నిమజ్జన సమయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రజలు, ఉత్సవ కమిటీలు, అధికారులు పరస్పరం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల సహకారంతోనే జిల్లాలో గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని ఆమె తెలిపారు. నిమజ్జన సమయంలోనూ ప్రజలు అధికారులకు సహకరిస్తూ జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉత్సవ సమితి సభ్యులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సంబంధిత తహసీల్దార్లతో సమన్వయం చేసుకుని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా గణేష్ ఉత్సవ సమితి, విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు మద్ది యాదిరెడ్డి, కార్యదర్శి ఎం. బాలయ్య, సహాయ కార్యదర్శి లక్ష్మణ్, వి.హెచ్.పి. నగర అధ్యక్షుడు రెబ్బ విఘ్నేష్, సభ్యులు చేపల హనుమంతు, రాములు, మాల్యాద్రి, కార్పొరేటర్లు ప్రవీణ్ కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# సంపాదకీయం

## మాతృదేశంపై మానవీయ వెలుగులు

నా మేథో వ్యాసంగాలలో నేను చాలావరకు ఒంటరిగానే కృషి చేస్తాను. పూర్వ విద్యార్థుల సంఘాలకు దూరంగా ఉంటాను. వాట్సాప్ గ్రూపులలో చేరడం నాకు ఇష్టం లేదు. ప్రముఖ హాస్యనటుడు గ్రూచో మార్క్స్ ఆలోచనా విధానమే నాది కూడా. 'నన్ను సభ్యుడిగా చేర్చుకోవడానికి ఏ క్లబ్ అయితే సిద్ధంగా ఉంటుందో అలాంటి క్లబ్‌లో నేను ఎప్పటికీ చేరను' అని గ్రూచో అన్నాడు. ఢిల్లీలో ఉన్నప్పుడు (1980ల్లో) కొన్ని సంవత్సరాల పాటు పీపుల్స్ యూనియన్ ఫర్ డెమొక్రాటిక్ రైట్స్ (పీయూడీఆర్)కు సన్నిహితంగా మెలిగేవాణ్ణి. ప్రతి శనివారం త్రివేణి కళా సంఘంలో జరిగే పీయూడీఆర్ సమావేశాలకు హాజరవుతుండేవాణ్ణి. పరిశోధక విద్యార్థిగా నాకు లభించే ఉపకార వేతనం నుంచి ఒక స్వల్ప మొత్తాన్ని ఆ హక్కుల సంఘానికి ఇస్తుండేవాణ్ణి. ఒక సందర్భంలో పీయూడీఆర్ ఏర్పాటు చేసిన నిజనిర్ధారణ సంఘంలో సభ్యుడిగా కూడా ఉన్నాను. ఆ హక్కుల సంఘంలో నేను ఎన్నడూ కీలక కార్యకర్తగా లేను. సహ ప్రయాణికుడిని, సానుభూతిపరుడిని మాత్రమే. పౌరహక్కుల పరిరక్షణలోను, ప్రజాస్వామిక చైతన్యాన్ని పెంపొందించడంలోనూ పీయూడీఆర్ కృషి పట్ల నాకు అపార గౌరవాభిమానాలు ఉన్నాయి. 1990ల్లో నేను ఢిల్లీ నుంచి బెంగళూరుకు మారాను. దీంతో ఆ హక్కుల సంఘంతో నా సన్నిహిత సంబంధం తెగిపోయింది. ఇటీవల ప్రచురితమైన అంకితా పాండే పుస్తకం చదివినప్పుడు పీయూడీఆర్‌తో నా సంబంధాలు జ్ఞాపకమొచ్చాయి. ally activismకు ఉదాహరణగా పౌర హక్కుల సంఘాలను ఆమె పేర్కొన్నారు. 'ప్రత్యక్ష, వ్యక్తిగత లేదా భౌతిక ప్రయోజన సంబంధం లేనివారు ఒక అణగారిన వర్గానికి మద్దతుగా చేపట్టే సామూహిక చర్య'గా 'అల్లే యాక్టివిజం'ను ఆమె నిర్వచించారు. భారతదేశ పౌరహక్కుల ఉద్యమాల్లో రెండు విస్తృత ధోరణులు ఉన్నాయని అంకితా పాండే వివరించారు. ఒకటి–రాజ్యాంగంలో క్రోడీకరించిన పౌరుల హక్కుల రక్షణ కాగా, మరొకటి ప్రజల విస్తృత సామాజిక, ఆర్థిక హక్కుల సాధన. 1970ల్లో కలకత్తా కేంద్రంగా పనిచేసిన అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ డెమొక్రాటిక్ రైట్స్ (ఏపీడీఆర్) స్వతంత్ర భారతదేశంలో ప్రప్రథమ పౌర హక్కుల సంఘం. నక్సలైట్ ఉద్యమంతో సంబంధమున్న జైలు ఖైదీలపట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈ తొలి పౌరహక్కుల సంఘం విశేష కృషి చేసింది. కాలక్రమానుసారంగా ఏపీడీఆర్ మొట్టమొదటి హక్కుల సంఘం అయినప్పటికీ విస్తృత కృషి చేసిన హక్కుల సంఘం మాత్రం పీయూడీఆర్ అని చెప్పవచ్చు. పలు దశాబ్దాల పాటు చేసిన కృషిలో దాదాపు 300 నివేదికలను ఈ సంఘం ప్రచురించింది. విచారణలో ఉన్న ఖైదీలపై పోలీసుల క్రౌర్యం, ఎన్‌కౌంటర్ మరణాలు, అసంఘటితరంగ కార్మికుల దుస్థితి, అడవులపై ఆదివాసీల హక్కులకు ఎసరు పెట్టిన చట్టాలు, మహిళలపై దాడులు, దౌర్జన్యాలు, దళితులపై దురాగతాలు, మతపరమైన మైనారిటీలపై వివక్ష మొదలైన అంశాలపై ఏపీడీఆర్ నివేదికలు పథ నిర్దేశకమైనవి. ఆ నివేదికల్లో అనేకం ఇప్పుడు ఏపీడీఆర్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. న్యూఢిల్లీ కేంద్రంగా పనిచేసిన పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ (పీయూసీఎల్) మరో ప్రముఖ హక్కుల సంఘం. న్యాయకోవిదుడు జస్టిస్ వీఎం తార్కుండే సారథ్యంలో ఇది పలు రాష్ట్రాల్లో పనిచేసింది. ఆంధ్రప్రదేశ్ సివిల్ లిబర్టీస్ కమిటీ, హ్యూమన్ రైట్స్ ఫోరమ్ ఉభయ తెలుగు రాష్ట్రాలలో క్రియాశీలకంగా ఉన్నాయి. మహారాష్ట్రలో క్రియాశీలకంగా ఉన్న కమిటీ ఫర్ ది ప్రొటెక్షన్ ఆఫ్ డెమొక్రాటిక్ రైట్స్ వ్యవస్థాపకులలో అస్ఘర్ అలీ ఇంజినీర్ ఒకరు. అంకితా పాండే పుస్తకంలోని ఒక అధ్యాయం భారతదేశంలోని పౌరహక్కుల సంఘాల ప్రధాన కార్యాచరణ రూపమైన 'నిజనిర్ధారణ నివేదికల (ఫ్యాక్ట్–ఫైండింగ్ రిపోర్ట్స్)పై దృష్టి సారించింది. హింసను ప్రేరేపించడంలోనూ, తద్వారా పౌరుల భద్రత, రక్షణ, ప్రజాస్వామ్య హక్కులను ఉల్లంఘించడంలోనూ ప్రభుత్వాధికారుల నేరపూరిత బాధ్యతను నిరూపించడానికి ఈ నివేదికలు ప్రయత్నిస్తాయి. ఈ నివేదికలు మూడు ముఖ్యమైన విధులు నిర్వర్తించాయని అంకితా పాండే వివరించారు. మొదటిది–ప్రజల జ్ఞాపకాలను చట్టపరంగా ఉపయోగపడే ఆధారాలుగా మార్చాయి. నిజ నిర్ధారణ సంఘాలు ప్రజల వాంగ్మూలాలను క్రమబద్ధీకరించి, ధ్రువీకరించి ఒక నివేదిక రూపంలో భద్రపరిచాయి. తద్వారా వాటిని న్యాయస్థానాలు అంగీకరించేలా చేశాయి; రెండోది–సంఘటనల పూర్వాపరాల చరిత్రను సవివరంగా నమోదు చేయడం; మూడోది–పోలీసు రికార్డులు, పరిపాలనా పరమైన పత్రాలు, నివేదికలలోని లోపాలను గుర్తించడం, పరస్పర విరుద్ధ విషయాలను ఎత్తిచూపడం, తద్వారా వాస్తవాలను తారుమారు చేసిన రికార్డులను బయటపెట్టడం. అధికారిక కథనాలను నిరాకరించి, వాటిలోని అసంగతాలు, పరస్పర వైరుధ్యాలను బహిర్గతం చేసి, తద్వారా ప్రజల, పత్రికల దృష్టిలో వాటి విశ్వసనీయతను ప్రభావదాయకంగా ప్రశ్నించడమే ఈ 'నిజ నిర్ధారణ' నివేదికల లక్ష్యం. ప్రభుత్వం పాల్పడిన తప్పుడు పనులపై అవి వెలుగులు ప్రసరించాయి. ప్రభుత్వాధికారుల పక్షపాతాలు, పాక్షికాభిప్రాయాలను అవి బాహాటపరిచాయి. ఈ పౌరహక్కుల సంఘాల కార్యకర్తలు అందరూ స్వచ్ఛంద సేవకులే. రాజ్యాంగ స్ఫూర్తితో సముదాత్త ఆశయాల సాధనకు అంకితమై సమాజ శ్రేయస్సుకు నిస్వార్థంగా శ్రమిస్తున్న ఉదాత్త వ్యక్తులు. విదేశీ, కార్పొరేట్ నిధులు ఏ విధంగానూ తీసుకోరు. సమాజ దురభిప్రాయాలు, ప్రభుత్వాల వ్యతిరేకత నెదుర్కొంటూ అవిరామంగా, అవిశ్రాంతంగా పనిచేస్తున్న నిజమైన ప్రజా సేవకులు. బాహ్య ఒత్తిళ్లతో పాటు ఒక అంతర్గత సవాల్‌ను కూడా వారు ఎదుర్కొన్నారు: రాజ్యం పట్ల విమర్శనాత్మక వైఖరిని పాటిస్తూ అదే సమయంలో రాజకీయ పక్షాల ప్రభావం లేకుండా స్వతంత్రంగా వ్యవహరించడం. దీనితో పాటు జెండర్ న్యాయానికి సంబంధించిన ప్రశ్న కూడా వారిని వెంటాడింది. పీయూడీఆర్, ఏపీసీఎల్‌సీ ప్రముఖ కార్యకర్తల్లో పలువురు మహిళలు ఉన్నారు. పౌరులకు వ్యతిరేకంగా రాజ్య వ్యవస్థ పాల్పడుతున్న హింసాత్మక కార్యకలాపాలపైనే హక్కుల సంఘాలు తమ దృష్టిని కేంద్రీకరించాలని వారి పురుష సహచరుల వాదన.. మహిళా కార్యకర్తలు వారితో ఏకీభవించడం లేదు. కుటుంబ జీవిత పరిధిలో చోటు చేసుకుంటున్న హింస గురించి కూడా హక్కుల సంఘాలు పట్టించుకోవాలనేది మహిళా ఉద్యమకారుల వాదన. ప్రజాస్వామిక హక్కుల విస్తృత చట్రంలో ఒక ప్రధాన భాగంగా మహిళా హక్కులను అంతిమంగా హక్కుల సంఘాలు అంగీకరించాయి. పౌరహక్కుల ఉద్యమంలో పనిచేస్తున్న వారిలో విద్యావేత్తలు, పాత్రికేయులు, న్యాయవాదులు ప్రధానంగా ఉన్నారని అంకితా పాండే పేర్కొన్నారు. వేతన జీవులు అయిన ఈ మధ్యతరగతి విద్యావంతులు తమ మాతృదేశాన్ని మరింత న్యాయమైన, మానవీయ సమాజంగా రూపొందించేందుకు అంకితమైన ఆదర్శవాదులు. భారత రాజ్య వ్యవస్థ అభియోగాల మేరకు సుదీర్ఘకాలం జైలు నిర్బంధంలో ఉన్న న్యాయవాది, హక్కుల కార్యకర్త సుధా భరద్వాజ్ అభిప్రాయాన్ని పాండే తన పుస్తకంలో ఉటంకించారు: 'నేను జైలులో మూడు సంవత్సరాలు గడిపాను. నా జైలు జీవితం చాలా బాధాకరంగా ఉన్నదనడంలో సందేహమేమీ లేదు. అయితే నాకంటే దురదృష్టవంతులు చాలామంది ఉన్నారు. వారి దుస్థితికి రోదించాను. నా హృదయం ద్రవించింది. మీరు అటువంటి దుష్కర పరిస్థితుల్లో ఉన్నప్పుడు మీ గురించి మీరు బాధపడడం కష్టం. బాధల్లో ఉన్న ఇతరులకు మీరు సహాయం చేయాల్సి ఉంటుంది.' కీర్తిశేషుడు సీవీ సుబ్బారావు (1953–94)దీ ఇటువంటి మానవీయ స్వభావమే. పీయూడీఆర్ కార్యకలాపాల్లో ఆయన చాలా సంవత్సరాల పాటు కీలకపాత్ర వహించారు. 1984లో సిక్కుల ఊచకోతపై పీయూడీఆర్ నివేదిక 'హు ఆర్ ది గిల్టీ'తో అంకిత పుస్తకం ప్రారంభమైనా సుబ్బారావు గురించి ఆమె ప్రస్తావించలేదు. ఆ నివేదిక ప్రధాన రచయిత సుబ్బారావే. అంకితా పాండే కథనంలో సుబ్బారావు ప్రస్తావన లేకపోవడాన్ని ఆమె తప్పుగా భావించలేము. ఎందుకంటే ఇతరుల కోసం తాను చేసిన పనిని ఆయన ఎప్పుడూ ఏ విధంగానూ చెప్పుకునేవారు కాదు. పీయూడీఆర్ కృషిలో తన ప్రమేయం గురించిన ప్రస్తావన రావడాన్ని ఆయన నిరాకరించేవారు. సుబ్బారావును ప్రత్యక్షంగా కలిసి, గమనిస్తేనే ఆయన ఎటువంటి ఉదాత్తుడో అర్థమవుతుంది. భారత ప్రజాస్వామ్యానికి ఆయన నిశ్చయంగా ఒక నిజమైన హీరో. చిన్న చిన్న లోపాలు ఉన్నప్పటికీ అంకితా పాండే పుస్తకం విశిష్టమైనది. పౌరహక్కుల ఉద్యమాన్ని స్థూలంగా సమీక్షించిన విలువైన గ్రంథమది.

## కలెక్టర్ బంగ్లాలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ఖుష్బూ గుప్తా

### వినాయక విగ్రహానికి ప్రత్యేక పూజలు - ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం నిర్వహించాలి



మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 19 (వేకువ సమయం ప్రతినిధి): మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ బంగ్లా ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా శనివారం పాల్గొన్నారు. అంతకుముందు బంగ్లా ఆవరణలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు వినాయక చవితి వేడుకలను సుఖసంతోషాలతో, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. నిమజ్జనం కోసం జిల్లా యంత్రాంగం అన్ని అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసిందని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ, నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, అప్రమత్తంగా నిర్వహించుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఎ. శ్రీనివాసులు, ఇతర జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రత, ఆరోగ్యకర వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలి





### - స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 19 (వేకువ సమయం ప్రతినిధి): మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ, విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడిన అదనపు కలెక్టర్ పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యార్థులకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల అధికారులను ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడిన అదనపు కలెక్టర్, పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ముందస్తు ప్రణాళికతో సిద్ధం కావాలని సూచించారు. చదువుపై ఏకాగ్రత పెంచుకుని కష్టపడి చదివి నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం బేసిక్ ప్రాక్టీస్ ఉన్నత పాఠశాల ఆవరణను కూడా ఆయన పరిశీలించారు. పాఠశాలలో పరిశుభ్రతతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుడిని ఆదేశించారు. పాఠశాలలో పారిశుధ్యం, మౌలిక వసతులు, విద్యా కార్యక్రమాలపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టి విద్యార్థుల సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులను అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్ ఆదేశించారు.

## వర్షాల్లోనూ విధి నిర్వహణకు సిబ్బంది సిద్ధంగా ఉండాలి

### - జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్



మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 19 (వేకువ సమయం ప్రతినిధి): వర్షాకాలంలో విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది భద్రత, సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రైన్ కోట్లు పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్, ఐపీఎస్ ఆదేశాల మేరకు శనివారం మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ సిబ్బందికి రైన్ కోట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ పోలీస్ సిబ్బంది నిరంతరం విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలందిస్తున్నారని తెలిపారు. సిబ్బంది ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన రక్షణ పరికరాలు, సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల భద్రత కోసం విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది ఆరోగ్యం, భద్రతకు కూడా సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. వర్షాకాలంలో రహదారులు, ట్రాఫిక్, బందోబస్తు తదితర విధుల్లో పనిచేసే సిబ్బంది రైన్ కోట్లు వినియోగించుకుని సురక్షితంగా విధులు నిర్వహించాలని సూచించారు. పోలీస్ సిబ్బందికి మెరుగైన పని వాతావరణం కల్పించడంతో పాటు అవసరమైన సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడంపై జిల్లా పోలీస్ శాఖ నిరంతరం దృష్టి సారిస్తుందని ఎస్పీ డి.జానకి తెలిపారు.

## హైదరాబాద్‌లో 20వ రోజ్‌గార్ మేళా ప్రారంభం

### 221 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేత




హైదరాబాద్, సెప్టెంబర్ 19 (వేకువ సమయం ప్రతినిధి): హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో 20వ రోజ్‌గార్ మేళా కార్యక్రమాన్ని కేంద్ర హోం వ్యవహారాల సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రారంభించారు. హైదరాబాద్ జోన్ సెంట్రల్ టాక్స్, కస్టమ్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 221 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో నిర్వహించిన 20వ రోజ్‌గార్ మేళాలో 51 వేల నియామక పత్రాలను అందజేసినట్లు బండి సంజయ్ కుమార్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 10 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యానికి అనుగుణంగా ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఇప్పటివరకు నిర్వహించిన 19 రోజ్‌గార్ మేళాల్లో దేశవ్యాప్తంగా 12.75 లక్షల నియామక పత్రాలు అందించినట్లు తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్టార్టప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా తదితర కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. కొత్తగా ఉద్యోగాలు పొందిన అభ్యర్థులను అభినందించిన బండి సంజయ్ కుమార్.. అంకితభావంతో విధులు నిర్వహిస్తూ దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి హైదరాబాద్ జోన్ సెంట్రల్ టాక్స్, కస్టమ్స్ చీఫ్ కమిషనర్ అరుణ్ కుమార్ స్వాగతం పలికారు. నూతన ఉద్యోగులు ప్రభుత్వ సేవల్లో కొత్త ఆలోచనలు, ఉత్సాహాన్ని తీసుకురావాలని ఆకాంక్షించారు. హైదరాబాద్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్‌లో 221 మంది నూతన ఉద్యోగులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. జీఎస్టీ, కస్టమ్స్, సంబంధిత చట్టాలు, కార్యాలయ విధానాలు, క్షేత్రస్థాయి పనితీరుపై శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. తెలంగాణ పోలీసు అకాడమీ సహకారంతో ఇన్‌స్పెక్టర్లకు ప్రత్యేక ఆయుధ నైపుణ్య శిక్షణ కూడా ఇస్తామని తెలిపారు. "పౌరుడు, పన్ను చెల్లింపుదారుడు, దేశం తొలి ప్రాధాన్యత" అనే సూత్రంతో విధులు నిర్వహించాలని నూతన ఉద్యోగులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జీఎస్టీ కమిషనరేట్ ప్రిన్సిపల్ కమిషనర్ ఎన్.జే. కుమరేష్, పలువురు ఉన్నతాధికారులు, నూతన ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## 51 వేల మందికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు.. 20వ రోజ్‌గార్ మేళాలో ప్రధాని మోదీ సందేశం

మొదటి పేజీ తరువాయి

దేశవ్యాప్తంగా ఇవాళ నిర్వహించిన 20వ 'రోజ్‌గార్ మేళా'లో 51వేల మందికి పైగా యువతకు కేంద్ర ప్రభుత్వ వివిధ శాఖల్లో నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వర్చువల్‌గా ప్రసంగించిన ప్రధాని నరేంద్ర మోదీ, 2047 నాటికి భారత్‌ను 'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారత్)గా మార్చే ప్రయాణంలో యువతదే అత్యంత కీలక పాత్ర అని స్పష్టం చేశారు. దేశంలో పండుగల సీజన్ ప్రారంభమైన వేళ, వేలాది కుటుంబాల్లో ఈ ఉద్యోగాలు కొత్త ఆనందాన్ని నింపాయని ప్రధాని అన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌ను నిర్మించాలనే లక్ష్యంతో దేశం ముందుకు సాగుతున్న తరుణంలో యువత ప్రభుత్వంలో చేరుతున్నారని, వీరు తీసుకునే ప్రతి నిర్ణయం 'వికసిత్ భారత్', 'ఆత్మనిర్భర్ భారత్' ఆశయాల్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. భారతీయ యువత నైపుణ్యాలపై ప్రపంచానికి ఎంతో నమ్మకం ఉందని ప్రధాని పేర్కొన్నారు. గత కొన్నేళ్లలో దాదాపు 40 దేశాలతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు యువతకు నూతన ఉద్యోగ, వ్యాపార అవకాశాలను తెచ్చాయని చెప్పారు. రూ. 60,000 కోట్ల వ్యయంతో 'పీఎం సేతు' పథకం ద్వారా 1,000 ప్రభుత్వ ఐటీఐ లను పరిశ్రమల భాగస్వామ్యంతో ఆధునీకరిస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ నెట్‌వర్క్ భారత్‌లో ఉందన్న ప్రధాని, గుర్తింపు పొందిన స్టార్టప్‌లలో సగానికి పైగా టైర్–2, టైర్–3 నగరాల్లోనే ఉన్నాయని, చిన్న నగరాల యువత ఉద్యోగ సృష్టికర్తలుగా మారుతున్నారని ప్రశంసించారు. ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కల్పనకు రూ. 1 లక్ష కోట్లతో ఈ పథకాన్ని ప్రారంభించామని, దీని ద్వారా తొలిసారి ఉద్యోగంలో చేరే దాదాపు 2 కోట్ల మంది యువతకు రూ. 15,000 వరకు ఆర్థిక ప్రోత్సాహకం లభిస్తుందని తెలిపారు. దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో ఈ 20వ రోజ్‌గార్ మేళాను నిర్వహించారు. రైల్వే, హోం శాఖ, రక్షణ, రెవెన్యూ, ఆరోగ్య, ఆర్థిక సేవల శాఖల్లో ఎంపికైన అభ్యర్థులకు ఈ నియామక పత్రాలను అందించారు. ఇప్పటివరకు నిర్వహించిన రోజ్‌గార్ మేళాల ద్వారా మొత్తం దాదాపు 12.75 లక్షల మంది యువతకు కేంద్ర ప్రభుత్వంలో ఉద్యోగ అవకాశాలు లభించాయి.




# గణనాథుల నిమజ్జనం సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకోవాలి : ఎస్పీ

**నిమజ్జనం ఊరేగింపు సమయంలో డీజేలు, బాణాసంచా కాల్చడం వంటివి నిషేధం**
**గణేష్ ఉత్సవ కమిటీలు త్వరితగతిన పూజలు ముగించి వెలుతురు ఉండగానే తమ విగ్రహాలను జాగ్రత్తగా తరలించాలి**
**సిసి కెమెరాలు నిఘా నిఘాలో గణేష్ నిమజ్జనం శోభాయాత్ర**
**నిమజ్జనం శోభాయాత్రకు పోలీసుల భారీ పటిష్ఠ బందోబస్తు**
**వనపర్తిలో శోభాయాత్ర మార్గాన్ని, నిమజ్జనం జరిగే ప్రాంతం నల్లచెరువును పరిశీలించిన ఎస్పీ**




వనపర్తి : జిల్లాలో వినాయక నిమజ్జనాలు భక్తిప్రపత్తులతో పరస్పర సహకారంతో శోభాయాత్రలు నిర్వహించి, గణపయ్యలకు జిల్లావ్యాప్తంగా ఘనమైన వీడ్కోలు పలుకుదామని జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, అన్నారు. గురువారం రోజు వనపర్తి పట్టణం నల్లచెరువు వద్ద నిమజ్జనం జరిగే ప్రదేశాన్ని, నిమజ్జన శోభయాత్ర జరిగే రూట్ ను జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి, వనపర్తి డిఎస్పీ, గిరిబాబు, వనపర్తి సీఐ, సుగంధ రత్నం, పోలీసు అధికారులతో కలిసి సందర్శించారు.వనపర్తి జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి నిమజ్జనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా, ఎలాంటి అవాంచనియా సంఘటనలు, ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన భద్రత, బందోబస్త్ ఏర్పాట్లు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.... నిమజ్జన సమయంలో పోలీసు వారి యొక్క సూచనలకు అనుగుణముగా నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు నడుచుకొని ప్రశాంతముగా నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యేలా సహాయ సహకారాలు అందించాలని కోరారు. పోలీసుశాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, పోలీసు పికెట్లు, ఇతర ప్రభుత్వశాఖల సమన్వయంతో రోడ్ల మరమ్మత్తు, బారిగేడింగ్, లైట్లు, క్రేన్లు, మంచినీటి వసతి ఏర్పాటు చేశామని, నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో గజఈతగాళ్ల అందుబాటులో ఉంటారన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రత ఏర్పాట్లను చేయడం జరిగింది అన్నారు. అన్ని ప్రాంతాలలో సీసీ కెమెరాల పర్యవేక్షణలో గణేష్ నిమజ్జన ఊరేగింపు ఉంటుందన్నారు. గణేష్ ఉత్సవ కమిటీలు త్వరితగతిన పూజలు ముగించి వెలుతురు ఉండగానే తమ విగ్రహాలను జాగ్రత్తగా తరలించాలని ఊరేగింపులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని చిన్న పిల్లలు మహిళలు శోభ యాత్రలో పాల్గొన్నప్పుడు ప్రమాదాలు జరగకుండా చూడాలని అలాగే ట్రాక్టర్ల, లారీలపై, ఇతర వాహనాలపై వచ్చే చిన్నారులు జాగ్రత్తగా ప్రయాణించాలని కాళ్లు చేతులు క్రిందకు వేలాడస్తు ప్రయాణం సాగించవద్దని పొరపాటున కాలుజారి పడిపోతే ప్రమాదం సంభవిస్తుందని అన్నారు. నిమజ్జనం సమయంలో, క్రేన్ సహాయంతో నిమజ్జనం చేసే సమయంలో యువత చిన్నారులు మహిళలు అప్రమత్తంగా ఉండాలని సహాయకులు అందుబాటులో ఉండాలని అన్నారు .నిమజ్జనం సందర్భంగా ఊరేగింపు సమయంలో డీజేలు, బాణాసంచా కాల్చడం వంటివి నిషేధమని సూచించారు. నిమజ్జనానికి వస్తున్న భక్తులకు ఏలాంటి అసౌకర్యాలు కలగకుండా రద్దీగా ఉండే ప్రదేశాలలో ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవడం జరిగింది అన్నారు. ముఖ్యంగా ఉత్సవ కమిటీ సభ్యులు బాధ్యతగా నియమ నిబంధనలను పాటిస్తూ పోలీసువారి సూచనలను పాటించాలని కోరారు. చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భక్తిశ్రద్ధలతో నవరాత్రులను ముగించుకొని ఆఖరున జరిగే నిమజ్జన కార్యక్రమాన్ని మత సామరస్యంతో,శాంతియుత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పీ,గిరిబాబు, వనపర్తి సీఐ,సుగంధ రత్నం, వనపర్తి పట్టణ ఎస్సై, హరిప్రసాద్, వనపర్తి రూరల్ ఎస్సై, హృషికేష్ ట్రాఫిక్ ఎస్సై, సురేందర్, మున్సిపల్ సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## మదనాపురంలో ఘనంగా గణపతి నవరాత్రి వేడుకలు




దేవరకద్ర, సెప్టెంబర్ 19 (వేకువ సమయం ప్రతినిధి): మదనాపురం మండల కేంద్రంలో గణపతి నవరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పలు గణపతి మండపాలను సందర్శించి విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథుడిని భక్తిశ్రద్ధలతో పూజించి, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యం కలగాలని ఆకాంక్షించారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న మండపాల నిర్వాహకులను అభినందించారు.

## మైత్రి హాస్పిటల్‌లో అన్నప్రసాద వితరణ




మహబూబాబాద్, సెప్టెంబర్ 19 (వేకువ సమయం ప్రతినిధి):గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మైత్రి హాస్పిటల్‌లో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ బాలు నాయక్, డాక్టర్ సుచిత్ర ఆధ్వర్యంలో గత ఐదు రోజులుగా మట్టి వినాయక విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.నిమజ్జనం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు నాయక్, డాక్టర్ సుచిత్ర మాట్లాడుతూ గణనాథుడి ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని వారు సూచించారు. ప్రతిఏటా మైత్రి హాస్పిటల్‌లో మట్టి వినాయకుడిని ఏర్పాటు చేసి ప్రజల సుఖశాంతుల కోసం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వీరన్న, డాక్టర్ కుమార్ స్వామి, డాక్టర్ రమేష్, డాక్టర్ జగన్మోహన్ రెడ్డి, డాక్టర్ రాంరెడ్డి, మైత్రి హాస్పిటల్ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.




హైదరాబాద్, సెప్టెంబర్ 19: నగరంలో శనివారం సాయంత్రం పలుచోట్ల వర్షం కురిసింది. జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్, మణికొండ ప్రాంతాల్లో వర్షం పడటంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. అలాగే నాగోల్, ఉప్పల్, రామంతపూర్, రాజేంద్రనగర్ ప్రాంతాల్లోనూ వర్షం కురిసింది. శంషాబాద్, చంద్రాయణగుట్ట, బాలాపూర్ ప్రాంతాల్లో కూడా వర్షపు జల్లులు నమోదయ్యాయి. మరోవైపు ఖైరతాబాద్, మాసబ్‌ట్యాంక్, నాంపల్లి ప్రాంతాల్లోనూ వర్షం కురవడంతో ఆయా ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి. వర్షంతో నగర వాతావరణం చల్లబడింది. ఒక్కసారిగా వర్షం కురవడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధాన రహదారులు, రద్దీ ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం నెలకొంది. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచే అవకాశం ఉండటంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. నగరంలోని మరికొన్ని ప్రాంతాల్లోనూ వర్షం కురిసే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## జూరాల ఆయకట్టు ఎండిపోతున్న పంటలను తక్షణమే ఆదుకోవాలి



హైదరాబాద్, సెప్టెంబర్ 19 (వేకువ సమయం ప్రతినిధి): జూరాల ప్రాజెక్టు పరిధిలోని గద్వాల, ఆత్మకూరు ప్రాంతాల్లో సాగునీరు అందక ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నీటిని విడుదల చేయాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ కోరారు. ఈ విషయంపై శనివారం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితులను వివరించారు.జూరాల ఆయకట్టు కింద సాగు చేసిన పంటలకు నీరు అందకపోవడంతో గద్వాల, ఆత్మకూరు ప్రాంతాల రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఎంపీ తెలిపారు. రైతులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు, నిరసనలు చేపడుతున్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.రాబోయే మూడు రోజుల్లోగా జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డీకే అరుణ కోరారు. పంటలు పూర్తిగా ఎండిపోయిన తర్వాత నీటిని విడుదల చేసినా ప్రయోజనం ఉండదని అన్నారు. రైతులు చెమటోడ్చి సాగు చేసిన పంటలు కళ్ల ముందే ఎండిపోతుండటంతో అన్నదాతలు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని పేర్కొన్నారు.రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మానవీయ కోణంలో ఆలోచించి జూరాల దిగువన ఉన్న సాగుభూములకు వెంటనే నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ మంత్రిని ఎంపీ డీకే అరుణ కోరారు.
కోదాడలో మెగా జాబ్ మేళా.

## యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం: గుత్తా సుఖేందర్ రెడ్డి



కోదాడ : సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రారంభించారు.ఈ సందర్భంగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగం అంటే కేవలం ప్రభుత్వ ఉద్యోగం మాత్రమే కాదని, ప్రైవేట్ రంగంలోనూ లక్షలాది ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కోదాడలో నిర్వహిస్తున్న ఈ మెగా జాబ్ మేళా దేశంలోనే ప్రత్యేకమైన కార్యక్రమంగా నిలుస్తుందని పేర్కొన్నారు.జాబ్ మేళాలో ఉద్యోగం రాకపోయినా యువత నిరుత్సాహపడవద్దని, ఓటమిని గెలుపుకు తొలి మెట్టుగా భావించాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలను ఆయన అభినందించారు.మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పనితీరు చాలా మెరుగ్గా ఉందని, ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఉత్తమ్ దంపతులు ఉత్తమంగా పనిచేస్తున్నారని గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రశంసించారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా ప్రస్తుతం కొంత క్లిష్ట పరిస్థితులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బీఎల్ఆర్, కుంభం అనిల్ కుమార్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, కార్పొరేషన్ చైర్మన్లు పటేల్ రమేష్ రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# బీరం లక్ష్మారెడ్డికి కేటీఆర్ ఘన నివాళులు









కొల్లాపూర్ : మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి తండ్రి బీరం లక్ష్మారెడ్డి రెండురోజుల క్రితం స్వర్గస్థులైన విషయం తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కేటీఆర్ గారు, మాజీ మంత్రులు శ్రీ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి , శ్రీనివాస్ గౌడ్ , సి. లక్ష్మారెడ్డి , అలంపూర్ ఎమ్మెల్యే శ్రీ విజయుడు, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి , శ్రీ మర్రి జనార్ధన్ రెడ్డి ,జీవన్ రెడ్డి , రాష్ట్ర నాయకులు ఆర్ ఎస్ ప్రవీణ్ ,మాజీ కార్పొరేషన్ చెర్మన్లు అల్లిపురం. వెంకటేశ్వర రెడ్డి ,ఇంతియాజ్ ఈ రోజు సింగోటం గ్రామంలోని వారి వ్యవసాయ క్షేత్రంలో వెళ్లి బీరం లక్ష్మారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.అనంతరం బీరం హర్షవర్ధన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బీరం లక్ష్మారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు

## పంటలకు పంట బీమాను వర్తింపచేయాలి

### గ్రామాల వారిగా పంట నష్టంపై అంచనా వేసి రైతులకు ప్రభుత్వం నష్టపరిహారాన్ని చెల్లించాలి
### మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్



షాద్నగర్ : కాలం సరిగా లేక అన్ని వర్గాల రైతులు తీవ్ర స్థాయిలో నష్టపోతున్నారని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల దశాబ్ద కాలంలో ఎన్నడూ లేని విధంగా రైతులు తమ పంటలను నష్టపోయారని, ఆర్థికంగా తీవ్ర నష్టానికి గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యేడు సరైన సమయంలో వర్షాలు పడక, పంటలకు సరిపడా నీళ్లు లేక ఇప్పటికీ సుమారు 80% మేరా పంటలు ఎండిపోతున్నాయని, భూగర్భ జలాలు మరింత అడుగంటుతే వరి పంట కూడా పండే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎలినో పరిస్థితి నేపథ్యంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అండగా నిలవవలసిన అవసరం ఉందని, వారిని అన్ని విధాలుగా ఆదుకోవాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంతాలలో పంటల సాగుపై క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి పంటల నష్టం పై అంచనా వేసి రైతులకు తగిన ఆర్థిక భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. పంట బీమా తక్షణ వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అన్ని ప్రాంతాలలో మొక్కజొన్న పంట పూర్తిగా ఎండిపోయిందని, వర్షంపై ఆధారపడి పంటలు స్థాయిలో సాగు కాలేదని చెప్పారు. రానున్న యాసంగి పంటలకైనా విత్తనాలు, ఎరువులు పెద్ద మొత్తంలో రైతులకు అందించాలని కోరారు. ఎలినో ప్రభావం ఎదుర్కొనే విధంగా రైతులకు సలహాలు సూచనలు చేసి వాతావరణానికి అనుకూలంగా పంటలు వేసే విధంగా ప్రోత్సహించాలని కోరారు. ప్రతి పంటకు మద్దతు ధర వచ్చే విధంగా, సకాలంలో పంటకు తగిన డబ్బులు అదే విధంగా ప్రభుత్వాలు చొరవ చూపాలని సూచించారు. రైతు బంధు నిధులను సైతం సకాలంలో విడుదల చేసి రైతుకు అండగా ఉండాలని ఆకాంక్షించారు.

## హాఫీజ్‌పేట్ మహిళపై దాడి ఘటన.. డీజీపీ సంచలన నిర్ణయం



హైదరాబాద్: హాఫీజ్‌పేటలో మహిళపై హోంగార్డు విచక్షణా రహితంగా దాడి చేసిన ఘటనపై డీజీపీ సీవీ ఆనంద్ స్పందించారు. మహిళపై దాడి చేయడాన్ని సీవీ ఆనంద్ తీవ్రంగా ఖండించారు ఆయనను సర్వీస్ నుండి తొలగించడంతో పాటు, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ కు ఆదేశాలు ఇచ్చినట్టు తెలిపారు. ఇదిలా ఉంటే హాఫీజ్ పేటలో మహిళపై కానిస్టేబుల్ విచక్షణారహితంగా దాడి చేసిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. మహిళ అని చూడకుండా జుట్టుపట్టుకుని లాక్కు వెళ్లడంపై నెటిజన్లు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. నిందితుడుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇక వీడియో డీజీపీ దృష్టికి సైతం వెళ్లడంతో ఏకంగా సర్వీస్ నుండి తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు.

## శ్రీ బొజ్జ గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించిన: మాజీ చైర్మన్



మహబూబ్నగర్ : వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 49వ డివిజన్ పరిధిలోని శేషాద్రి నగర్ అదేవిధంగా, బయమ్మ తోట, రాజేంద్రనగర్, కిసాన్ నగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను దర్శించుకుని గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని శ్రీ వినాయక స్వామిని ప్రార్థించారు. అనంతరం మండపాల నిర్వాహకులు, భక్తులతో కలిసి ఉత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గోటూరి రాజు, రామ్ నరేష్, కర్ణం రవి, దీపక్, భాను, అఖిల్ రాజ్, తీర్థ వర్ధన్ గౌడ్ తదితరులు, ఆయా వినాయక మండపాల సభ్యులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టును ఆశ్రయించిన దానం నాగేందర్

హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఎమ్మెల్యే పదవిపై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ ఎల్లుండి విచారణకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దానం నాగేందర్ మాట్లాడుతూ.. ఖైరతాబాద్ గణేశుడి ఆశీస్సులతో ప్రజాక్షేత్రంలో పోరాడుతానని దానం నాగేందర్ అన్నారు. ఉప ఎన్నికకు తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఖైరతాబాద్ గణేశుడు ఎలా ఫేమస్ అయ్యాడో.. హైకోర్టు తీర్పుతో దేశ స్థాయిలో తాను కూడా చాలా ఫేమస్ అయ్యానన్నారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, ఉప ఎన్నిక వస్తే ప్రజల రుణం తీర్చుకుంటానని దానం నాగేందర్ పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే





దేవరకద్ర : భూత్పూర్ మండలం పాత మొల్గర గ్రామంలో భూత్పూర్ మండలానికి చెందిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్లు దేవరకద్ర ఎమ్మెల్యే శ్రీ జి. మధుసూదన్ రెడ్డి (GMR) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇండ్ల పథకం లక్ష్యమని తెలిపారు. అనంతరం కొత్త మొల్గర గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన పెన్షన్ల వెరిఫికేషన్, SIR వెరిఫికేషన్ కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (GMR) పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెరిఫికేషన్ ప్రక్రియను ఎమ్మెల్యే పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## విద్యార్థుల సౌకర్యమే మా ప్రాధాన్యం..
## మోడ్రన్ మరుగుదొడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్ : మున్సిపాలిటీ 25వ వార్డు పరిధిలోని కుంటబండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన ఆధునిక మరుగుదొడ్లను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. రాయికల్ టోల్ ప్లాజా వారి ఆర్థిక సహకారంతో ఈ మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపడితే విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యనభ్యసించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం ఆధునిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయడం అభినందనీయమని, పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. పాఠశాలలో నెలకొన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రధానోపాధ్యాయురాలు భాగ్యమ్మ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. పాఠశాల అవసరాలను పరిశీలించి సాధ్యమైన మేరకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, కౌన్సిలర్లు పెంటయ్య, రాజు నాయక్, మండల విద్యాధికారి మనోహర్, ముబారక్ అలీ ఖాన్, చందు నాయక్, రవితేజ, శేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..

## వినాయకుడికి ప్రత్యేక పూజలు...
## అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్న ఏపి మిథున్ రెడ్డి

మహబూబ్నగర్: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపి మిథున్ రెడ్డి వినాయక మండపాలను సందర్శించి విఘ్నేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.గణేష్ ఉత్సవ సమితి, క్లాక్ టవర్,రామ్ మందిర్ చౌరస్తా,వీరన్నపేట్,టీడీ గుట్ట తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించి విఘ్నేశ్వరుని ఆశీస్సులు పొందారు.అనంతరం హమాలి సంఘం,రామ్ మందిర్ చౌరస్తా,టీడీ గుట్ట లలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఏపి మిథున్ రెడ్డి పాల్గొని భక్తులకు స్వయంగా భోజనం వడ్డించారు.భక్తులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ,ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు,శాంతి, ఆయురారోగ్యాలు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విఘ్నేశ్వర స్వామివారి ఆశీస్సులతో ప్రజల కష్టాలు,విఘ్నాలు తొలగి ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు.వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో పాటు సామాజిక ఐక్యత,సోదరభావం,శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవతా విలువలను పెంపొందిస్తాయని,భక్తులకు సేవ చేసే అవకాశం లభించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు,భక్తులు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## జిల్లా అధ్యక్షులు డాక్టర్ వెంకట మూర్తి ఘనంగా సన్మానం



వనపర్తి : తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ పార్టీ మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షత బాధ్యతలు చేపట్టిన తెలంగాణ ఉద్యమకారులు సంఘ సేవకులు డాక్టర్ వెంకట మూర్తి కి టిఆర్ఎస్ పార్టీ మహబూబ్ నగర్ నియోజకవర్గ ఇంచార్జ్ దొడ్ల సౌజన్య రెడ్డి చేతుల మీదగా ఘనంగా సన్మానం చేయడం జరిగింది ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు డాక్టర్ వెంకట మూర్తి మాట్లాడుతూ నా మీద నమ్మకంతో తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అప్పజెప్పిన బాధ్యతలను కార్యకర్తలు అందరిని కలుపుకొని ముందుకు తీసుకెళ్తాలని ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని పార్టీ ఆదేశించిన కార్యక్రమాలను ముందుకు తీసుకుంటానని అన్నారు ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు తెలంగాణ రక్షణ సేన నాయకులు శ్యామ్ పూర్ణచందర్ ఆంజనేయులు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు

**ఒకటికి నాలుగు దుకాణాలు తిరిగి, పలు రకాల చీరలను ప్రత్యక్షంగా పరిశీలించకుండా చీరల కొనుగోలు సాధ్యపడదు. కానీ కేవలం ఫేస్‌బుక్ లైవ్ ద్వారా మహిళల నమ్మకాన్ని చూరగొంటూ, ఇప్పటివరకూ పది లక్షల చీరలను విక్రయించారు హైదరాబాద్‌కు చెందిన సంగీత రాజేష్. ఎనిమిదిన్నర లక్షల ఫేస్‌బుక్ ఫాలోవర్లను కలిగి ఉన్న సంగీత... 'నవ్య'తో పంచుకున్న విశేషాలివి.**




"చీరల వ్యాపారంలోకి నా ప్రవేశం యాధృచ్ఛికంగానే జరిగిపోయింది. అంతకంటే ముందు రెమిడియల్ టీచర్‌గా పని చేశాను. ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు బోధకురాలిగా పని చేయడంతో పాటు సొంత స్కూళ్లను కూడా నెలకొల్పాను. ఆ స్కూళ్లలో స్పీచ్, బిహేవియరల్ థెరపీలను బోధిస్తూ, ఆ పిల్లలను సాధారణ బడులకు సిద్ధం చేస్తూ ఉండేదాన్ని. అది సేవాధారిత రంగం. పైగా ఫ్రాంచేజీలను నెలకొల్పడం ఇష్టం లేదు. అలాంటప్పుడు ఎదుగుదల ఎలా సాధ్యపడుతుంది? అందుకే, నాకంటూ ప్రత్యేక గుర్తింపు పొందాలంటే, వినూత్నమైన ప్రయత్నానికి పూనుకోవాలని అనిపించింది. ఆ క్రమంలో ఉత్పత్తుల రంగంలోకి ప్రవేశించాలని నిర్ణయించుకున్నాను. అలా పదిహేనేళ్ల కిందట చీరల స్టోర్ మొదలుపెట్టాను. అప్పట్లో నాలాగే ఎంతోమంది మహిళలు ఈ రంగంలో ఉన్నారనే విషయం ఆలస్యంగా తెలిసింది. అలాంటప్పుడు వాళ్లందర్లో ప్రత్యేకంగా కనిపించడమెలా? అనే ఆలోచన మొదలైంది. దాంతో అవగాహన కోసం నిఫ్ట్‌లో కోర్సు పూర్తి చేశాను. చీరల డిజైనింగ్ మొదలుపెట్టాను. ఆ సమయంలోనే ఫేస్‌బుక్‌లో బిజినెస్ పేజీ అందుబాటులోకొచ్చింది.

### వ్యూహాలు, ఆఫర్లతో ఆకట్టుకుని...

ఫేస్‌బుక్ బిజినెస్ పేజీని ప్రవేశపెట్టడంతో ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాను. చేనేత కళాకారుల దగ్గరకు వెళ్లి చీరల తయారీ వివరాలు సేకరించి, నేనే మోడల్‌గా మారి ఆ ఫొటోలు, వీడియోలు ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసేదాన్ని. క్రమేపీ వినియోగదారులు పెరగడం మొదలుపెట్టారు. అయితే చీరల నాణ్యత పట్ల వినియోగదారులకు నమ్మకం కలిగించడానికి ఎంతో కష్టపడవలసి వచ్చింది. వాళ్లను ఆకట్టుకోవడానికి మొదటి వంద కస్టమర్లకూ బహుమతులను అందించడం లాంటి వినూత్న ప్రయోగాలు ప్రారంభించాను. అలా నిలోఫర్ టీ పొడులు మొదలు, హెయిర్ క్లిప్పులు, బొట్టు బిళ్లల ప్యాకెట్లు, కుక్కర్లు లాంటి మహిళల మనసులను చూరగొనే ఆఫర్లను అందించాను. ఫేస్‌బుక్ లైవ్ ద్వారా చీరలను విక్రయించడంతో పాటు, మచిలీపట్నం, శ్రీకాళహస్తి, సూరత్, జైపూర్... ఇలా చీరలు తయారయ్యే ప్రాంతాలకు వెళ్లి, అక్కడి నుంచి లైవ్ షోలు చేస్తూ, ఆర్డర్లు తీసుకునేదాన్ని. అలా వ్యాపారం క్రమేపీ పుంజుకుంటున్న సమయంలో కొవిడ్ వచ్చింది. కొవిడ్, ప్రత్యక్ష వ్యాపారాలను దెబ్బతీసి ఉండొచ్చు. కానీ ఆ కాలంలో నా వ్యాపారం మరింత పుంజుకుంది.

### నెలలో 15వేల చీరలు

ఒక లైవ్ సెషన్ నాలుగు నుంచి ఐదు గంటల పాటు కొనసాగుతుంది. విక్రయించే ప్రతి చీరనూ చూపించి, దాని ప్రత్యేకతలను వివరిస్తూ, వాట్సాప్ లింక్ ద్వారా అప్పటికప్పుడే విక్రయాలు జరుపుతూ ఉంటాను. ఒక లైవ్ షోలో 100 కాంచీపురం చీరలు విక్రయించిన సందర్భాలూ ఉన్నాయి. అలాగే గత నెలలో ఏకంగా ఒకటిన్నర కోట్ల ఖరీదైన 15 వేల చీరలను ఆన్‌లైన్‌లో విక్రయించాను. కొన్నిసార్లు చీరలు మిగిలిపోతూ ఉంటాయి. ఈ డెడ్‌స్టాక్‌ను పండుగ రోజుల్లో కేవలం కొరియర్ రుసుము తీసుకుని ఉచితంగా పంపించేస్తూ ఉంటాను. ఇలా వినియోగదారుల నమ్మకంతో పాటు అభిమానాన్ని చూరగొనగలిగాను. అలాగే ఒక చీర మాత్రమే చూపించి, దొంతరలోని ఏదో ఒక చీర కొనుక్కోండి అన్నప్పుడు, మహిళలు ఆసక్తి కనబరిచారు. ఈ ఆలోచన నాకు లబుబు టాయిస్ నుంచి వచ్చింది. బయటకు కనిపించే వీల్లేకుండా ప్యాక్ చేసి బొమ్మను విదేశాల్లో విక్రయిస్తూ ఉంటారు. ఉత్సుకత అనే సూత్రం ఆధారంగా వ్యాపారాన్ని ఎలా పెంచుకోవచ్చో గ్రహించాను. క్రమం తప్పకుండా బెంగుళూరు, విశాఖపట్టణం, కొయంబత్తూరు, చెన్నై, బెంగుళూరు, పూణె, ఢిల్లీ, ముంబయిల్లో చీరల ప్రదర్శనలు కూడా ఏర్పాటు చేస్తుంటాను.

### సవాళ్లు లేకపోలేదు...

ఫేస్‌బుక్ లైవ్‌లో ఆర్డర్లు తీసుకుని చీరలను విక్రయించడం చూడడానికి సులభంగా కనిపించవచ్చు. కానీ తెర వెనక ఎంతో కష్టం దాగి ఉంటుంది. గంటల తరబడి వినియోగదారులను ఎంగేజ్ చేయగలగాలి. వాళ్లకు ఓ పక్క వినోదాన్ని పంచుతూ ఆసక్తికరంగా చీరల గురించి వివరించగలగాలి. ఇదంతా ఒక ఎత్తైతే, చీరలను వినియోగదారులకు వీలైనంత త్వరగా అందించడం మరొక ఎత్తు. చీరల వ్యాపారం సులభతరమనీ, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సంపాదించవచ్చని ఎంతోమంది మహిళలు ఈ రంగంలోకి అడుగుపెట్టి దెబ్బతింటూ ఉంటారు. వాళ్లకు కొన్ని సలహాలు ఇవ్వాలనుకుంటున్నాను. ఎవర్నో చూసి మనం కూడా ఈ వ్యాపారం చేద్దామని అనుకోకూడదు. ఈ రంగంలో ఎదగాలనే బలమైన సంకల్పంతో పాటు టెక్స్‌టైల్స్, ఫ్యాబ్రిక్స్, మార్కెట్ గురించి అవగాహన పెంచుకొని, ఎప్పటికప్పుడు కొత్త వ్యూహాలతో, ఆఫర్లతో వినియోగదారులను ఆకట్టుకోగలగాలి."

# లైకుల వేటలో..!

కొన్ని విషాదాలు గుండెలను పిండేస్తాయి. హిమాచల్ ప్రదేశ్‌లోని మంచుకొండల్లో గడ్డకట్టుకుపోయిన రెండు ప్రాణాలు ఓ మొబైల్ ఫోన్ ఇచ్చిన శాపాలు. సోషల్ మీడియాలో లైకుల కోసం ప్రాణాలనే పణంగా పెడుతున్న నేటి తరం పోకడలకు నిదర్శనం. 19 ఏళ్ల వీక్షిత్ రాణా, 13 ఏళ్ల పియూష్ కుమార్‌లకు హిమాచల్‌లోని మంచు కొండలు, కోనలతోపాటు వారి వెంట ఉండే కుక్కలే ప్రపంచం. కానీ ఈ అన్నదమ్ములకు తల్లిదండ్రులు ప్రేమతో ఇచ్చిన స్మార్ట్‌ఫోన్ వారి జీవితాల్లోకి ప్రవేశించాక ఆ ప్రపంచమే మారిపోయింది. ఆ చిన్న తెరపై కనిపించే రీల్స్, కంటెంట్ క్రియేషన్ మాయలో పడి ప్రకృతి వైపరీత్యాన్ని కూడా గమనించలేకపోయారు. వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్ జారీచేసినా, సోషల్ మీడియాలో ఫాలోవర్లను మెప్పించే సాహసం కోసం వారు మంచు శిఖరాల వైపు అడుగులేశారు. చివరికి మంచు తుపానులో చిక్కుకుని వారు శవాలుగా మారినా, వారి పెంపుడు కుక్క నాలుగు రోజులపాటు తిండీతిప్పలు లేక ఆ దేహాలను కాపలా కాయడం ప్రతి ఒక్కరితో కంటతడి పెట్టించింది.



### నిషేధాల వెనుక నిజమెంత?

ఈ విషాదం ఒక్క హిమాచల్ ప్రదేశ్‌ది మాత్రమే కాదు, ప్రపంచవ్యాప్త సమస్య. అందుకే ఫ్రాన్స్ ప్రభుత్వం 15 ఏళ్లలోపు పిల్లలపై సోషల్ మీడియా నిషేధానికి చట్టం తెస్తోంది. ఆస్ట్రేలియా కూడా అదే బాటలో ఉంది. ఇక మన దేశంలో ఆంధ్రప్రదేశ్, గోవా వంటి రాష్ట్రాలు కూడా ఈ దిశగా ఆలోచన చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అయితే, కేవలం చట్టాలు చేస్తే సమస్య తీరిపోతుందా? అనేదే అసలు ప్రశ్న.

### తల్లిదండ్రులూ...

ఇక్కడ అసలు సిసలైన సమస్య 'ఎలిఫెంట్ ఇన్ ది రూమ్' (అందరికీ తెలిసినా విస్మరించే పెద్ద సమస్య) లాంటి తల్లిదండ్రుల ప్రవర్తనే. నేటి మిలీనియల్స్, అంతకంటే పెద్దవారు గుర్తింపు కోసం, సోషల్ స్టేటస్ కోసం ఫోన్లలో గంటల తరబడి గడుపుతున్నారు. పిల్లలను ఫోన్ పక్కన పెట్టమని శాసించే పెద్దలు, తాము మాత్రం ఆ మాయలో మునిగిపోవడం తగదనేది మానసిక నిపుణుల మాట.

### డిజిటల్ డిటాక్స్

అయితే 'జెన్‌జీ' అని పిలిచే నేటి యువతలో ఇప్పుడిప్పుడే కొంత మార్పు కనిపిస్తోంది. నిరంతరం అల్గారిథమ్స్ గుప్పిట్లో బతకడం కంటే, ఆఫ్‌లైన్ జీవితమే ప్రశాంతమని వారు గుర్తిస్తున్నారు. ఓ నివేదిక ప్రకారం.. యువత ఇప్పుడు 'పోస్టింగ్ జీరో' వైపు మొగ్గు చూపుతోంది. అంటే కంటెంట్‌ను కేవలం వినోదం కోసమే చూస్తున్నారు తప్ప, లైకుల కోసం తాము పరితపించడం తగ్గుతోంది. డిజిటల్ తెరలను పక్కనపెట్టి నిజమైన స్నేహాలు, అభిరుచులకు సమయం కేటాయిస్తున్నారు.

# బహుజన రాజ్యాధికార సమరభేరిని విజయవంతం చేయాలి

జోగులాంబ : (జిల్లా కేంద్రం): అక్టోబర్ 9న బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాదులో జరిగే బహుజన రాజ్యాధికార సమరభేరిని విజయవంతం చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ పార్లమెంట్ ఇన్చార్జి మాసన్న, జిల్లా అధ్యక్షుడు మణికుమార్ కోరారు. ఈ మేరకు శనివారం జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సంబంధిత గోడ పత్రికలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్రం వచ్చి 79 ఏళ్లు పూర్తి చేసుకుని అడుగుపెట్టిన రాజ్యాంగ మమల్నికొచ్చి 76 ఏళ్లు దాటిన ఇంకా దేశంలో అంటరానితన వివక్ష కొనసాగుతూనే ఉన్నాయన్నారు. 85 నుండి 90% ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల శ్రమతో దేశ సంపద పెరుగుతుంటే అగ్రకుల నాయకులు రాజకీయ అధికారాన్ని అనుభవిస్తూ బహుజనులను అణుగదొక్కుతున్నారని సందర్భంగా వారు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా ఈ దాడులు పెరిగాయని.. కోదాడలో కర్ల రాజేష్ లాకప్ డెత్, షాద్నగర్లో ప్రేమ జంట సజీవ దహనం, మెదక్లో మాదిగ యువకుడి గ్రామ బహిష్కరణ, నేరెళ్లలో దళితులపై దాడులు మరియు తాజాగా జోగులాంబ గద్వాల జిల్లా రేపల్లె గ్రామంలో దళితుల ఇంటిని కూల్చివేయడం అణచివేతకు సజీవ సాక్షాలని వారు పేర్కొన్నారు. రాష్ట్రంలో సంపద పెరిగిన పేద ప్రజలకు సొంత ఇండ్లు లేవన్నారు. ప్రభుత్వము అసైన్డ్ భూములను గుంజుకుంటున్నారని.. గురుకులాలలో పిల్లలకు నాణ్యమైన ఆహారం దక్కడం లేదని విమర్శలు చేశారు. అధికారంలోకి వస్తే దళితుడు సీఎం అని మాజీ సీఎం కేసీఆర్ మోసం చేస్తే.. ఇప్పుడు ఆరు గ్యారెంటీల పేరుతో ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ మోసం గ్యారంటీగా పాలన సాగిస్తుందన్నారు. అగ్రకుల పార్టీల నుంచి గెలిచిన ఎస్సీ, ఎస్టీల ఎమ్మెల్యేలు మరియు ఎంపీలు మౌనంగా ఉండడం మాన్యశ్రీ కాన్షీరామ్ గారు చెప్పిన చెంచా యుగానికి నిదర్శనం అన్నారు. రాజ్యాంగంలో



**బహుజనులపై దాడులు ఆగాలంటే**
**బహుజనులు పాలకులు కావాలి**
**మాన్యశ్రీ కాన్సీరామ్ వర్ధంతి సభ గోడపత్రికలు విడుదల**
**బీఎస్పీ పార్లమెంట్ ఇంచార్జి మాసన్న**
**జిల్లా అధ్యక్షులు మణి కుమార్లు**

హక్కులు ఉన్న పాలకులు అయ్యేది రాజకీయ పార్టీల ద్వారానే అన్న సత్యాన్ని మనం గ్రహించాలన్నారు. దళితులపై దాడులు జరుగుతున్నాయి తప్ప పాలకవర్గంపై కాదని విషయాన్ని కూడా బహుజన సమాజం నమ్మాలన్నారు. బహుజన సమాజంపై దాడులు ఆగాలంటే బహుజనులే పాలకులు కావాలన్నారు. రాజాధికారంతోనే బహుజనలకు రక్షణ, అభివృద్ధి సాధ్యమని సందర్భంగా వారు అన్నారు. కాబట్టి బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు మాన్యశ్రీ కాన్షీరాం వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ లో జరిగే భారీ బహిరంగ సభకు బహుజన సమాజంతో పాటు అంబేద్కరైట్లు పెద్ద మొత్తంలో హాజరై విజయవంతం చేయాలన్నారు. గోడపత్రికలను విడుదల చేసిన వారిలో జిల్లా ఉపాధ్యక్షులు సుదర్శన్, జిల్లా కోశాధికారి శాంతిరాజు, ఈసీ సభ్యులు దుబ్బన్న, గద్వాల అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి రామ్ పోగు నరేష్, ధర్మవరం రాముడు ఆకేపోగు నగేష్, దరెప్ప ఇతరులు పాల్గొన్నారు.

## పోషణ మాసం మల్దకల్ ప్రాజెక్టు



సమయం ప్రతినిధి: జోగులాంబ గద్వాల జిల్లా జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలో పోషణ మాసంలో భాగంగా ఈరోజు మల్దకల్ ప్రాజెక్టులోజణూూ ఆకాశ దీప్తి గారు మాట్లాడుతూ పోషకాహారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఉదాహరణకు చిరుధాన్యాలతో (మిల్లెట్స్) తయారుచేసిన ఆహార పదార్థాలను ఎక్కువగా వినియోగించాలని తెలిపారు. మునగాకు ప్రాముఖ్యత, అందులో ఉండే పోషక విలువల గురించి వివరించారు. సాధ్యమైనంత వరకు గ్రామంలో మునగ చెట్లను నాటేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక సర్పంచ్ను కోరారు. బిడ్డ జీవితంలోని మొదటి 1000 రోజుల ప్రాముఖ్యత గురించి వివరంగా చర్చించారు. IYCF (శిశు మరియు చిన్నపిల్లల ఆహార విధానాలు) మార్గదర్శకాలు, అలాగే WASH (నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత) పద్ధతుల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిట్టెమ్మ సూపర్వైజర్ జయమ్మ మండలంలోని అంగన్వాడి టీచర్లు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## తెలంగాణ వార్డ్ మెంబర్స్ ఫోరం జిల్లా ఇన్‌చార్జ్‌గా బోయ రవి నియామకం...



సమయం ప్రతినిధి: జోగులాంబ గద్వాల జిల్లా జోగులాంబ గద్వాల జిల్లా: తెలంగాణ వార్డ్ మెంబర్స్ ఫోరం జోగులాంబ గద్వాల జిల్లా ఇన్‌చార్జ్‌గా గట్టు మండలం ఆలూర్ గ్రామానికి చెందిన బోయ రవి నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ వార్డ్ మెంబర్స్ ఫోరం స్టేట్ ఫౌండింగ్ ప్రెసిడెంట్ నాగబెల్లి జ్యోతి సెప్టెంబర్ 19, 2026న అధికారిక నియామక పత్రాన్ని జారీ చేశారు. జోగులాంబ గద్వాల జిల్లాకు జిల్లా ఇన్‌చార్జ్‌గా ఆలూర్ బోయ రవి నియమిస్తున్నట్లు నియామక పత్రంలో పేర్కొన్నారు. సంస్థను బలోపేతం చేయడంతో పాటు వార్డు సభ్యుల సమస్యలు, వారి స్వరాన్ని సంబంధిత స్థాయికి తీసుకెళ్లడం, సంస్థ కార్యక్రమాలను విస్తృతం చేయడం వంటి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని తెలంగాణ వార్డ్ మెంబర్స్ ఫోరం వెల్లడించింది. జిల్లా ఇన్‌చార్జ్‌గా నియమితులైన రవి కు పలువురు వార్డు సభ్యులు, నాయకులు అభినందనలు తెలిపారు.

## శ్రీ సాయి నగర్ కాలనీ గణేష్ నవరాత్రి ఉత్సవాలకు 10.000 విరాళం. కిషన్ నాయక్



దేవరకొండ: సెప్టెంబర్ 19 (సమయం ప్రతినిధి) : దేవరకొండ పట్టణంలోని 16వ వార్డు, శ్రీ సాయి నగర్ కాలనీలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని BRS పార్టీ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్ గారు రూ. 10,000/- నగదు విరాళాన్ని అందజేశారు. శ్రీ సాయి నగర్ కాలనీ వినాయక మండప కమిటీ సభ్యులకు ఈ విరాళాన్ని అందజేస్తూ, భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, వినాయకుని కృపా కటాక్షాలతో ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కిషన్ నాయక్ తో పాటు కాలనీ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు మరియు భక్తులు పాల్గొన్నారు. బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు చూపించిన ఉదారతకు వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు మరియు కాలనీవాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## ఉరి వేసుకుని వ్యక్తి మృతి



వేకువ సమయం //మంచిర్యాల/లక్షెట్టిపేట : లక్షట్టిపేట పట్టణంలోని భగత్ సింగ్ నగర్ కు చెందిన గుర్రాల జయకర్ అనే 40 సంవత్సరాల వ్యక్తి ఇంటి సమీపంలోని వేప చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. మృతునికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. అందరికీ పెళ్లి ల్యయ్యాయి. మృతునికి కుటుంబ కలహాలతో నిన్న గొడవలు జరగగా మృతుడు తన సోదరులకు ఫోన్ చేసి నాకు ఇంట్లో కుటుంబ కలహాలతో ఎప్పుడు గొడవ జరుగుతుంది నాకు బతకడం ఇష్టం లేదు అని ఫోన్ చేసి చెప్పి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి సోదరుడు గుర్రాల చంద్రమౌళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయడం జరుగుతుందనీ ఎస్సై గోపతి సురేష్ ఒక ప్రకటనలో తెలియజేశారు

## చీర్యాల సాయినగర్‌లో ఘనంగా శ్రీ నారాయణీ ప్రత్యంగీరా మహాదేవి హోమం





వేకువ సమయం సెప్టెంబర్ 19 కీసర ప్రతినిధి : కీసర మండల పరిధిలోని చీర్యాల సాయినగర్‌లో శ్రీ నారాయణీ ప్రత్యంగీరా మహాదేవి హోమాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కీసర క్షత్రియ యూత్, సునీల్ వర్మ సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించారు. హోమ కార్యక్రమానికి మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ సద్గురు శాంకరి అఘోరి మాతాజీ పర్యవేక్షణలో వేద మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా ప్రత్యంగీరా హోమ క్రతువు కొనసాగింది. సకల గ్రహదోషాలు, శత్రుపీడ నివారణతో పాటు లోకకల్యాణం, ప్రజల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ఆకాంక్షిస్తూ ఎండు మిరపకాయలతో విశేష హోమాన్ని నిర్వహించారు. హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి అమ్మవారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కందాడి శ్రీకాంత్ రెడ్డి, జలాల్‌పురం సుధాకర్ రెడ్డి, చీర్యాల మాజీ సర్పంచ్ ధర్మేందర్, ఉపసర్పంచ్ తిరుమల్ రెడ్డి, పారిశ్రామికవేత్త జయరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## ఆన్‌లైన్ యాప్‌లలో పెట్టుబడులపై అప్రమత్తత అవసరం

**మోసపూరిత యాప్‌ల పట్ల జాగ్రత్త వహించాలి: సీఐ కమలాకర్**



జడ్చర్ల సెప్టెంబర్ 19, సమయం ప్రతినిధి అధిక లాభాలు వస్తాయంటూ ప్రచారం చేసే ఆన్‌లైన్ యాప్‌లలో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దని జడ్చర్ల పట్టణ సీఐ కమలాకర్ ప్రజలను హెచ్చరించారు. ఇటీవల కొందరు qvse వంటి యాప్‌లలో పెట్టుబడులు పెట్టగా, తొలినాళ్లలో ఖాతాలో నగదు పెరుగుతున్నట్లు చూపించడం, కొంత మొత్తాన్ని ఉపసంహరించుకునే అవకాశం కల్పించడం ద్వారా నమ్మకం కలిగించినట్లు తెలిపారు. అనంతరం నగదు ఉపసంహరణలు నిలిచిపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారని, ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. దేశంలో వివిధ రకాల ఆన్‌లైన్ యాప్‌లు అందుబాటులో ఉన్నాయని, వాటి విశ్వసనీయతను పరిశీలించకుండా పెట్టుబడులు పెట్టడం ప్రమాదకరమని సీఐ సూచించారు. అధిక లాభాల పేరుతో సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటనలను నమ్మవద్దన్నారు. అనుమానాస్పద యాప్‌లు, ప్రకటనల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇలాంటి మోసాలకు గురైన వారు ఆలస్యం చేయకుండా పోలీసులను సంప్రదించాలని సీఐ కమలాకర్ కోరారు. సైబర్ నేరాలకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు అందించి దర్యాప్తునకు సహకరించాలని సూచించారు.

## జీనుగురాల పాఠశాలలో ఏకరూప దుస్తుల పంపిణీ



దేవరకద్ర, సెప్టెంబర్ 19 (వేకువ సమయం ప్రతినిధి): దేవరకద్ర మండలం జీనుగురాల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత ఏకరూప దుస్తుల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నాగమ్మ సాయిలు, ఉపసర్పంచ్ పి. నరహరి విద్యార్థులకు దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగమ్మ సాయిలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు రెండు జతల ఏకరూప దుస్తులను ఉచితంగా అందజేస్తోందన్నారు. విద్యార్థులు ప్రతిరోజూ ఏకరూప దుస్తులు ధరించి క్రమశిక్షణతో పాఠశాలకు హాజరై, విద్యపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృ. వేంకటేశ్వరాచారి, ఉపాధ్యాయులు జి. అశోక్ కుమార్, బాదేపల్లి విజయలక్ష్మి, పూడూరు నాగరాజు, భీంపల్లి శ్రీకాంత్, జి. విద్యాధర్ రెడ్డి, టి. విజయలక్ష్మి, గ్రామ పెద్దలు యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మక్తల్ పట్టణ కేంద్రంలో బండ తిరుమలయ్య దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన బిజెపి రాష్ట్ర నాయకులు కొండయ్య

మక్తల్ : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా వారం రోజుల పాటు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా మఖ్తల్ పట్టణ కేంద్రంలో పురాతనమైన బండ తిరుమలయ్య స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు బి. కొండయ్య పాల్గొని, శ్రీ నరేంద్ర మోదీ కి సంపూర్ణ ఆయురారోగ్యాలు, బలం, శక్తి, దీర్ఘాయుష్షు కలగాలని ప్రత్యేకంగా ప్రార్థించారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ చేస్తున్న సేవలను మరింత శక్తితో కొనసాగించేలా భగవంతుడు ఆశీర్వదించాలని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ పి.కె. నరసింహ గారు, మహేష్ సాగర్, బ్యాటరీ రాజు, రాజా గౌడ్, నాగరాజు గౌడ్, పాలమూరు వెంకటేష్, రమేష్, రంకుల నవీన్, టింగిలి నవీన్, అరవింద్, కల్లూరి నందరాజు, గుంతల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ మేల ఉద్యోగ అవసరాల సర్వే

మహబూబాబాద్ జిల్లా (సెప్టెంబర్ 19 వేకువ సమయం ప్రతినిధి) : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, మహబూబాబాద్ జిల్లాలోని గ్రామీణ పట్టణ ప్రాంతాల యువతకు సంబంధించిన ఉద్యోగ అవసరాలు ఉద్యోగ ప్రాధాన్యతలను తెలుసుకునేందుకు జాబ్ రిక్రూర్మెంట్ మేలా నిర్వహిస్తున్నాము. కావున, జాబ్ మేళా-జాబ్ రిక్రూర్మెంట్ సర్వే పోస్టర్‌తో పాటు క్యూ ఆర్, కోడ్‌ను మహబూబాబాద్ జిల్లాలోని అన్ని గ్రామాలు మున్సిపాలిటీలలోని యువతకు విస్తృతంగా చేరేలా ప్రచారం చేయాలని కోరుతున్నాము. ప్రతి గ్రామం మున్సిపాలిటీలోని యువతకు ఈ సమాచారం చేరేలా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్థానిక సంస్థల ప్రతినిధులు సహకరించి, గరిష్ఠ సంఖ్యలో యువత ఈ సర్వేలో పాల్గొనేలా ప్రోత్సహించాలని కోరుతున్నాము.

**సంప్రదించవలసిన వారు - మహబూబాబాద్ జిల్లా**

1. శ్రీమతి రజిత, జిల్లా ఉపాధి అధికారి, 91 98661 42287.
2. శ్రీమన్నారాయణ రెడ్డి, జనరల్ మేనేజర్, జిల్లా పరిశ్రమల కేంద్రం, 91 93983 27435.
3. శ్రీ రాజేంద్రప్రసాద్, జిల్లా పౌర సంబంధాల అధికారి, 91 99081 52878.

## సిపిఐ నేత విజయరాములు కుటుంబాన్ని పరామర్శించిన సిపిఐ రాష్ట్ర నేతలు



అమరచింత : శాస్త్ర సాంకేతిక రంగం పరుగులు పెడుతుందని అంతరిక్షంలో మానవుడు సంచరిస్తున్నాడని గొప్పలు చెబుతున్న నేటి ఆధునిక యుగంలో కూడా ప్రజల ఆయుషుని కాపాడే వైద్యం లేకపోవడం విచారకరమని సిపిఐ అనుబంధ తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి అంజయ్య నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం అమరచింత మండల కేంద్రంలో ఇటీవల ఆకస్మిక మరణం చెందిన జ్యోతి చిత్రపటానికి సిపిఐ రాష్ట్ర నేతలు దాసోజ్ రవీంద్ర చారి, ముత్యాల యాదిరెడ్డి, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య నాయక్ లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి విజయరాములు కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్యోతి మరణం అత్యంత విషాదకరమని అన్నారు. జ్యోతి చిరునవ్వుతో అందరినీ ఆత్మీయంగా పలకరించేదని, కమ్యూనిస్టు పార్టీ అన్న, ప్రజా ఉద్యమాలు అన్న చాలా గౌరవించేదని, పేదలు లేని రాజ్యం కావాలన్నదే జ్యోతి లక్ష్యమని అన్నారు. విజయ రాములు ఆశయాలకు ఎలాంటి లోటు లేకుండా కమ్యూనిజం సిద్ధాంతం తన నిజ జీవితంలో అన్వాయించుకోవడమే కాకుండా మంచి కమ్యూనిస్టుగా బ్రతికారని అన్నారు. ప్రజల మేలుకోరి అనునిత్యం ప్రజల కోసం పనిచేస్తున్న విజయరాములు కుటుంబానికి తీరని శోకం మిగిలిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి రవీందర్, శ్యాంసుందర్, భాస్కర్, సిపిఐ అమరచింత మండల కార్యదర్శి అబ్రహం, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.సురేష్, సిపిఐ నాయకులు లక్ష్మీనారాయణ, బాలస్వామి, గాయని శ్యామల, గీత పద్మావతి, భారతి, శారద, చెన్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.





# అక్రమాలను అధికారంలో ఉన్నవాళ్లు దమ్ముంటే బయటపెట్టాలి

**కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్యేల చేత రాజీనామా చేయించాలి**
**ఫిరాయింపు ఎమ్మెల్యేలకు హైకోర్టు తీర్పు చెంపపెట్టు.**
**బి.ఆర్.ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్**

(సమయం ప్రతినిధి వనపర్తి) వనపర్తి నియోజకవర్గం పెబ్బేరు పట్టణంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడిన ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి. తన పర్యటనాలో రైతులు విద్యుత్,సాగునీటి కష్టాలు చెప్పుకున్నారన్నారు.ప్రకృతి కావల్సినన్ని నీళ్ళు ఇచ్చినా రైతులకు సాగునీరు లేదని ఆందోళన వ్యక్తం చేశారు ఉమ్మడి రాష్ట్రంలో ఏడు మెగా వాట్ల సామర్థ్యం మా ఉండగా 24 వేల మెగా వాట్లకు విద్యుత్ స్థాపిత సామర్థ్యం పెంచి నట్లు చెప్పుకొచ్చారు. రేవంత్ ప్రభుత్వంలో అత్యల్పంగా కృష్ణ నీళ్లను తెలంగాణ వాడుకుంది..కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ముప్పై శాతం కంటే ఎక్కువ నీళ్లు వాడుకున్నామని పాలమూరులో పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్ట్ లుగా మార్చిఏడు లక్షల ఎకరాలకు నీళ్ళు ఇచ్చామన్నారు. వరద వస్తుందంటే వెంటనే నీళ్ళు మళ్ళించే వాళ్ళమని చెక్ డ్యామ్ లు,చెరువులు నింపి పాలమూరులో నీళ్లు ఇచ్చామని వివరించారు. శనివారం పర్యటనలో రెండు సబ్ స్టేషన్ లకు రైతులతో కలిసి వెళ్ళామన్నారు.అధికారులు సమాధానం చెప్పలేకపోతున్నారు..ఆరు గంటలకు మించి విద్యుత్ సరఫరా కావట్లేదని రైతులు చెప్తున్నారు..లో ఓల్టేజ్, తరచూ కట్ చేయడంతో మోటర్లు కాలిపోతున్నాయని అంటున్నారు.నీళ్ళు ,కరెంట్ ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇవ్వలేకపోతుంది.కాంగ్రెస్ ఎమ్మెల్యే లు విద్యుత్ కష్టాలు,తాగునీటి కష్టాలు ఉన్నాయని చెప్తున్నారు.అన్ని ఉన్నప్పటికీ ఇవ్వలేని స్థితిలో కాంగ్రెస్ సర్కార్ ఉంది.పోతిరెడ్డిపాడు,వెలుగొండ ద్వారా నీళ్లు ఏపీకి పోతున్నాయి..జూరాల కు ఎగువ నుండి నీళ్లు లేవని..కాలువకు నీటి విడుదల ఆపామని అధికారులు చెప్తున్నారు.ఏపీకి నీళ్ళు పోతున్నాయి..మనకు ఎందుకు రావని ప్రశ్నించారు కల్వకుర్తి పంప్ లు ఆన్ చేయట్లేదు..రోజుకి రెండు మూడు సార్లు ఆన్ ఆఫ్ చేసే పంపు లు కావు.....ఒకసారి ఆన్ చేస్తే కంటిన్యూ గా నడపాల్సి ఉంటుంది.సీఎం సొంత ఊరు,సొంత జిల్లాలో కరెంట్,సాగునీటి కష్టాలతో రైతులు రోడ్డెక్కుతున్నారు..కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందు చూపు లేకనే ఈ దుస్థితి నెలకొంది.కర్ణాటక,ఏపీ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాయి....కృష్ణా జలాల విషయంలో తెలంగాణ రాష్ట్రం ప్రణాళికతో లేదు.ఆలమట్టి ఎత్తు పెంచే యోచనలో కర్ణాటక రాష్ట్రం ఉంది.దీంతో పాలమూరు కు భవిష్యత్తు లో నీళ్ళు రావు....ఈ విషయం మీద పక్కనే ఉన్న కర్ణాటకను ఎందుకు నిలదీయట్లేదు..ఐదు మీటర్ల ఎత్తుకి కర్ణాటక కాంగ్రెస్ లక్ష కోట్లు ఖర్చు పెడుతుంది.కృష్ణా జలాల్లో పాలమూరు వాటా దక్కే వరకు ఊరుకో బోమని ప్రకటించారు అధికారంలో ఉన్న వాళ్ళు అక్రమాలు ఏం జరిగిందో బయట పెట్టాలి.



అధికారంలో ఉన్న వాళ్ళు అక్రమాలు ఏం జరిగిందో బయట పెట్టాలి.. పార్టీ ఫిరాయింపు చేసిన ప్రతి ఒక్కరిపై చర్యలు తీసుకోవాలి.. రాజ్యాంగ బద్దంగా శాసనసభ పక్షం విలీనం అయింది.. కాంగ్రెస్ లో చేరిన మిగతా ఎమ్మెల్యే లతో రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు.

## బీసీలకు అన్యాయం జరిగింది - జేఏసీ జిల్లా కన్వీనర్ ముంజాల రాజేందర్



**27 నా బహిరంగ**
**సభను విజయవంతం చేయండి**

మహబూబాబాద్ జిల్లా: (సెప్టెంబర్ 19 వేకువ సమయం ప్రతినిధి):రాష్ట్ర బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ ఆదేశానుసారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ధర్మ సమాజ్ పార్టీ మద్దతుతో, బీసీ ఎస్ సి,, ఎస్ టీ -జేఏసీ ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ ఏర్పాటు చేయనైనది. తేది:27.09.2026 ఆదివారం మధ్యాహ్నం 12.గం.లకు ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలో హంటర్ రోడ్ డి కన్వీన్షన్ హన్మకొండ లో ఎవరి కులం ఎంతో వారికంత వాటా బహిరంగ పంచాయతీ (సభ)కు మహబూబాబాద్ జిల్లా నుండి బీసీ, ఎస్ సి, ఎస్ టీ,అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలనీ పిలుపు ఇవ్వడం జరిగింది. ఈ ప్రెస్ మీట్ జేఏసీ జిల్లా కన్వీనర్ ముంజాల రాజేందర్ అధ్యక్షతన జరుగగా ముఖ్య అతిధిగా ఉమ్మడి వరంగల్ జిల్లా జేఏసీ చైర్మన్ చందా మల్లయ్య మరియు మాజీ ఎంఎమ్మెల్యే బండి పుల్లయ్య హాజరై మాట్లాడుతూ ఇప్పటి రాజ్యాంగం అమలులోకి వచ్చి దాదాపు 80 సం.రాలు గడుస్తున్నా అధిక సంఖ్యలో ఉన్న బీసీ లకు వారి జనాభా ప్రాతిపదికన వారి వాటా వారికీ ఇవ్వలేదు.అల్ప సంఖ్యకులైన అగ్రవర్ణాల వారే అధికారంలో ఉంది అధిక అంఖ్యకులైన బీసీ, ఎస్ సి,ఎస్ టీ,లకు కనీస అవసరలైన విద్యా వైద్యం కూడా అందించని పరిస్థితి ఉంది ఇప్పటికైనా అగ్రవర్ణాల పార్టీలలో పనిచేస్తున్న బీసీ,ఎస్సి,ఎస్ టీ,లు మేల్కొని మీ మీ పార్టీలలో ఎవరికులం ఎంతో వారికంత వాటా ఇవ్వాలని ఆడగండి. మా జేఏసీ తో కలిసి పని చేయాలనీ ఎవరి వాహనాలు వారు ఏర్పాటు చేసుకొని స్వచ్ఛందంగా రావాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్ గండి వీరేందర్ గౌడ్, డీ స్ పి జిల్లా ఇంచార్జ్ రాంపక సుధాకర్ మహారాజ్. దుగ్గి గోపాల్ రజక. రజక సంఘం రాష్ట్ర ఉప అధ్యక్షులు,గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు జెరిపోతుల వెంకన్న గౌడ్, మాదిగ జాగృతి సంఘం జిల్లా అధ్యక్షులు గుండెల్లి బిక్షపతి మహారాజ్, గౌడ సంఘం జిల్లా కార్యదర్శి పెద్ది వెంకన్న గౌడ్, మోకు దెబ్బ రాష్ట్ర కార్యదర్శి గద్దం సమ్మయ్య గౌడ్, రమణ బోయినా వీరన్న ముదిరాజ్. జిల్లా కార్యదర్శి, నేతుల వెంకన్న యాదవ్. యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు,గంధసిరి వేణు తెలంగాణ ఉద్యమ కారుడు, దుగ్గి రవి రజక. రజక సంఘం జిల్లా కార్యదర్శి, అడపా మాలికర్జున్ మేర, మేర సంఘం రాష్ట్ర నాయకులు, మందుల యాకన్నా మహారాజ్, బోడ రమేష్ నాయక్. ఎల్ ఎచ్ పి స్ జిల్లా అధ్యక్షులు, పేరం విరస్వామి. ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షులు, దాసరి లక్ష్మి నివాస్ ఏం జె స్ జిల్లా ఉప అధ్యక్షులు, నోముల నరేందర్ అడ్వొకెట్ కోట మల్లేష్, మోకు దెబ్బ జిల్లా అధికార ప్రతినిధి లింగాల విరభద్రం గౌడ్, దాసరి రాములు బి . బంజీ తదితరులు పాల్గొన్నారు.

## నాగారంలో యూ-టర్న్ సమస్యకు పరిష్కారం

**నాయకుల చొరవతో తిరిగి తెరుచుకున్న యూ-టర్న్. ప్రజలకు తగ్గనున్న రాకపోకల ఇబ్బందులు**



వేకువ సమయం సెప్టెంబర్ 19 కీసర ప్రతినిధి : కీసర మండలంలోని నాగారం ప్రజలు, వాహనదారులు కొంతకాలంగా ఎదుర్కొంటున్న యూ-టర్న్ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. యూ-టర్న్ మూసివేయడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడటంతో పాటు, ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో సమస్యను పరిష్కరించాలని స్థానిక నాయకులు, కౌకుంట్ల జీవన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కొండల్ రెడ్డి తదితర నాయకులు ట్రాఫిక్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.

ఈ నేపథ్యంలో నాయకులు ట్రాఫిక్ డీసీపీతో చర్చించి, నాగారం యూ-టర్న్‌ను తిరిగి తెరవాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రజల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకున్న అధికారులు సమస్య పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. చర్చల అనంతరం నాగారంలోని యూ-టర్న్‌ను తిరిగి ఓపెన్ చేశారు. యూ-టర్న్ అందుబాటులోకి రావడంతో నాగారం పరిసర ప్రాంతాల ప్రజలు, వాహనదారులకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. ముఖ్యంగా సమీప కాలనీల నుంచి ప్రధాన రహదారిపైకి వచ్చే వాహనదారులు దూరం చుట్టూ తిరిగి వెళ్లాల్సిన అవసరం తగ్గనుంది. ప్రజల సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేసిన నాయకులకు స్థానికులు అభినందనలు తెలిపారు. యూ-టర్న్‌ను తిరిగి అందుబాటులోకి తీసుకురావడంతో ట్రాఫిక్ సమస్యలు కూడా కొంత మేరకు తగ్గుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## కీసరలో యువకుడి అదృశ్యం.. 15 రోజులుగా ఆచూకీ లేదు
## కుటుంబంలో ఆందోళన.. దర్యాప్తు వేగవంతం చేయాలని విజ్ఞప్తి




వేకువ సమయం సెప్టెంబర్ 19 కీసర ప్రతినిధి : మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో గంధమాల అజయ్‌కుమార్ (21) అదృశ్యమై సుమారు 15 రోజులు గడుస్తున్నా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. కీసర గ్రామానికి చెందిన అజయ్ కుమార్ సెప్టెంబర్ 3న కనిపించకుండా పోయాడని, సెప్టెంబర్ 4న కీసర పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఆచూకీ లభించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.అజయ్‌కుమార్ ఆచూకీ కోసం ఫోన్ లొకేషన్, సీసీ కెమెరాల దృశ్యాలు, కాల్‌డేటా, స్నేహితులు, పరిచయస్తుల వివరాలను పరిశీలించి దర్యాప్తును వేగవంతం చేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. దర్యాప్తు విషయంలో ఎస్ఐ జ్ఞానేందర్‌రెడ్డి ఆశించిన స్థాయిలో స్పందించడం లేదని వారు ఆరోపించారు. ఈ ఆరోపణలపై పోలీసుల స్పందన తెలియాల్సి ఉంది. విషయం తెలుసుకున్న కీసర మండల సామాజిక కార్యకర్త తుడుం శ్రీనివాస్ అజయ్‌కుమార్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆచూకీ త్వరగా లభించేలా సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి, కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. శుక్రవారం ఉదయం కమిషనర్ సుమతిని కలిసి దర్యాప్తును వేగవంతం చేయాలని కోరనున్నట్లు శ్రీనివాస్ తెలిపారు.

## ఎమ్మెల్యే బాలునాయక్ చొరవతో
# పందిరిగుండుతండాకు తాగునీరు

దేవరకొండ: నేరడుగోమ్ము: సెప్టెంబర్ 19 (సమయం ప్రతినిధి) : నేరేడుగొమ్ము: నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం పందిరిగుండుతండా గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యపై దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ వెంటనే స్పందించారు. విషయం ఎమ్మెల్యే దృష్టికి రాగానే ఇరిగేషన్ అధికారులు, మిషన్ భగీరథ అధికారులతో సమన్వయం చేసి తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు.ఎమ్మెల్యే బాలునాయక్ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు పందిరిగుండుతండాకు చేరుకుని సమీపంలోని పెండ్లిపాకుల రిజర్వాయర్ నుంచి మొండి కట్టల చెరువులో ఏర్పాటు చేసిన బావిలోకి నీటిని తరలించారు. అనంతరం అక్కడి నుంచి బోర్ల సహాయంతో తండాలకు నీటిని సరఫరా చేశారు. దీంతో పందిరిగుండుతండా గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామస్తులకు తాగునీరు అందుబాటులోకి వచ్చింది.తాగునీటి సమస్యను తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే స్పందించి అధికారులను రంగంలోకి దించి సమస్యను పరిష్కరించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.సమస్యను వెంటనే పరిష్కరించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు: సర్పంచ్, గ్రామస్తులు పందిరిగుండుతండా సర్పంచ్, గ్రామస్తులు మీడియాతో మాట్లాడుతూ.. తమ తాగునీటి సమస్యను ఎమ్మెల్యే బాలునాయక్ దృష్టికి రాగానే ఆయన వెంటనే స్పందించారని తెలిపారు. అధికారులను నేరుగా తమ తండాకు పంపించి తాగునీరు అందేలా చర్యలు తీసుకున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.తమ గ్రామస్తుల దాహార్తిని తీర్చేందుకు ఎమ్మెల్యే బాలునాయక్ తక్షణమే చొరవ చూపడం అభినందనీయమని పేర్కొన్నారు. సమస్యను త్వరగా పరిష్కరించి తాగునీరు అందించిన ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**సమస్య పునరావృతం కాకుండా చర్యలు: అధికారులు.**

సంబంధిత అధికారులు మాట్లాడుతూ.. పందిరిగుండుతండాలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ఇరిగేషన్, మిషన్ భగీరథ శాఖల మధ్య సమన్వయంతో నీటి సరఫరాను కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఇకపై తాగునీటి సమస్య



పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. గ్రామంలో తాగునీటి సరఫరాను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తామని అధికారులు తెలిపారు.




## నెగిటివ్ ట్రోల్స్.. నష్టమేముంది

ఈమధ్యకాలంలో కొన్ని సినిమాలు థియేటర్లలో రికార్డు వసూళ్లతో బ్లాక్ బస్టర్ విజయాన్ని సాధించినప్పటికీ, ఓటీటీలోకి వచ్చాక మాత్రం మిశ్రమ స్పందన అందుకుంటున్నాయి. అంతేకాకుండా, డిజిటల్ వేదికలపైకి రాగానే కావాలనే కొన్ని వర్గాలు నెగిటివ్ ట్రోల్స్ చేయడం ఒక పరిపాటిగా మారింది. గతంలో జాతి రత్నాలు, ఉప్పెన, మిరాయ్, మన శంకరవరప్రసాద్ గారు, సంక్రాంతికి వస్తున్నాం, కొరియన్ కనకరాజు ఇలా బ్లాక్ బస్టర్ చిత్రాలు కూడా డిజిటల్ రిలీజ్ తర్వాత ఎన్నో విమర్శలు, మిశ్రమ స్పందననే ఎదుర్కొన్నాయి. ఇక ఇప్పుడు ఇరుముడి వంతు వచ్చింది. థియేటర్లలో రికార్డు కలెక్షన్లు సాధించి, రూ. 200 కోట్లకు పైగా రాబట్టిన రవితేజ ఇరుముడి సినిమా కేవలం 28 రోజుల వ్యవధిలోనే ఓటీటీలోకి వచ్చేసింది. ముందస్తు ఒప్పందాల ప్రకారం నెట్ ఫ్లిక్స్ లో డిజిటల్ స్ట్రీమింగ్ అవుతున్న ఈ చిత్రంపై సోషల్ మీడియా వేదికగా నెగిటివ్ ట్రోలింగ్ జరుగుతుంది. అసలు ఇందులో అసలు లాజిక్ ఏముంది? ఈ సినిమాను ఎలా హిట్ చేశారు? అంటూ తీవ్ర స్థాయిలో ట్రోల్స్ మొదలుపెట్టారు. ముఖ్యంగా మణికంఠ మరణించడం వెనుక అసలు లాజిక్ లేదని.. బస్సు లేని ఊరు నుంచి ఆ చిన్నారి ఎలా అంతా దూరం వెళ్లింది.? పుష్పవతి అయిన మణికంఠని తల్లి అర్ధరాత్రి బయటకు ఎలా పంపింది..? రవితేజ ఉన్నాడని తప్ప.. కథ మొత్తం చాలా సినిమాల్లో వచ్చింది.. చాలా లోపాలు ఉన్నాయి అంటూ నెటిజన్స్ సోషల్ మీడియాని షేక్ చేస్తున్నారు. నిజం చెప్పాలంటే సినిమాలో లోపాలు చాలా ఉన్నాయి. కానీ, వాటిని లెక్కచేయకుండా థియేటర్ లో స్క్రీన్ ప్రజెన్స్, ఫాస్ట్ పేసింగ్ మ్యాజిక్ వల్ల ఆడియన్స్ ఆ మైనస్‌లను అసలు పట్టించుకోలేదు. ఇప్పుడంటే ఓటీటీలో వచ్చింది. ఎక్కడ లాజిక్ లేదు అని సినిమాని ఆపి మరీ చూసి కనిపెడుతున్నారు. అంతేకాకుండా కొన్ని సినిమాలు థియేటర్ లో ఇచ్చే కిక్కు.. టీవిలో ఉండదు. థియేటర్‌లో మల్లెపూల పల్లకి లాంటి సాంగ్స్ వస్తున్నప్పుడు వందలాది మందితో కలిసి డాన్స్ చేయడం, భారీ డాల్బీ సౌండ్‌లో ఆ అనుభూతిని పొందడం వేరే లెవెల్‌లో ఉంటుంది. అయినా థియేటర్లో ఆడి, రికార్డులు సృష్టిస్తూ రూ. 200 కోట్ల మార్కును దాటేసిన ఈ టాలీవుడ్ బ్లాక్ బస్టర్ కు ఇప్పుడు ఓటీటీలో కొత్తగా బాగుంది.. బాలేదు అని సర్టిఫికెట్ ఇవ్వడం వల్ల ఎలాంటి నష్టమూ లేదు.




## దీపికా-రణ్‌వీర్ ఇంట మళ్లీ లక్ష్మీదేవి

బాలీవుడ్ స్టార్ కపుల్ దీపికా పదుకోణె, రణ్‌వీర్ సింగ్ ఇంట మళ్లీ పండగ వాతావరణం మొదలైంది. ఈ టాలెంటెడ్ అండ్ మోస్ట్ లవ్డ్ కపుల్ రెండవసారి తల్లిదండ్రులయ్యారు. శనివారం (19 సెప్టెంబర్ 2026) దీపికా పదుకోణె పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చినట్లు సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటన విడుదల చేశారు. పాప చిన్నారి అడుగుల గుర్తుతో రూపొందించిన క్యూట్ కార్డ్‌ను షేర్ చేస్తూ వెల్కమ్ బేబీ గర్ల్ అని రాసుకొచ్చారు. గతంలో ఈ జంటకు మొదటి సంతానంగా దువా జన్మించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు సరిగ్గా రెండేళ్ల తర్వాత, అదే సెప్టెంబర్ నెలలో మరోసారి లక్ష్మీదేవి లాంటి ఆడపిల్ల వారి జీవితంలోకి అడుగుపెట్టడంతో దీపికా-రణ్‌వీర్ దంపతులు ఆనందంలో మునిగితేలుతున్నారు. ఈ వార్త బయటకు రాగానే సోషల్ మీడియా వేదికగా సినీ రంగానికి చెందిన ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు ఈ ముద్దుల జంటకు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలుపుతున్నారు. రణ్‌వీర్ సింగ్ తన సినిమాలతో, దీపికా తన వరుస గ్లోబల్ ప్రాజెక్ట్‌లతో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ, కుటుంబానికి ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుంటాడు. ఇప్పుడు రెండో పాపాయి రాకతో వారి ఇంట్లో సందడి మరింత రెట్టింపు అయింది. దువాకు ఇప్పుడు ఒక ముద్దుల చెల్లెలు తోడైందంటూ ఫ్యాన్స్ పండుగ చేసుకుంటున్నారు. ఇక దీపికా సినిమాల విషయనికొస్తే.. ప్రస్తుతం అల్లు అర్జున్ సరసన రాకా సినిమాలో నటిస్తోంది. ఈ మధ్యనే ఆమె ప్రెగ్నెంట్ గా కొన్ని సీన్స్ షూట్ చేసినట్లు సమాచారం. ఇక కొన్నిరోజులు దీపికా రెస్ట్ మోడ్ లో ఉంటుందని, ఆ తరువాత రాకా షూట్ లో పాల్గొంటుందని తెలుస్తోంది.




## పేరు మారింది!

ప్రముఖ దర్శకుడు సతీశ్ వేగేశ్న తెరకెక్కించిన సినిమా 'కోతి కొమ్మచ్చి'. స్వర్గీయ రియల్ స్టార్ శ్రీహరి తనయుడు మేఘాంశ్‌తో పాటు ఈ సినిమాలో సతీశ్ వేగేశ్న కుమారుడు సమీర్ హీరోగా నటించాడు. రిద్ధి కుమార్, మేఘా చౌదరి హీరోయిన్లు. రాజేంద్రప్రసాద్, వి.కె. నరేశ్ కీలక పాత్రలు పోషించగా సిజ్జు, అన్నపూర్ణమ్మ, రాజశ్రీ నాయర్, మణిచందన, ప్రవీణ్, సుదర్శన్, శివన్నారాయణ, ఆనంద్ వర్మ, చింటు, రచ్చ రవి తదితరులు ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. అనూప్ రూబెన్స్ 'కోతికొమ్మచ్చి' సినిమాకు సంగీతం అందించారు. చాలా కాలం క్రితమే అమలాపురం, విశాఖపట్నం, రాజమండ్రిలో ఈ సినిమా షూటింగ్ జరిపారు. అయితే అనివార్య కారణాల వల్ల ఈ సినిమా అప్పట్లో విడుదలకు నోచుకోలేదు. దర్శకుడు సతీశ్ వేగేశ్న సైతం వేరే ప్రాజెక్ట్స్ తో బిజీ అయి, 'కోతి కొమ్మచ్చి' మూవీని పక్కన పెట్టేశారు. ఇప్పుడాయన ఈ సినిమాను విడుదల చేసే పనిలో పడ్డారు. అయితే... ఈ సినిమాకు కొత్త సొబగులు అద్దే క్రమంలో పేరును కూడా మార్చేశారు. ఇప్పుడీ సినిమా పేరు 'సరిపోయారు ఇద్దరూ'! ఇది వెంకటేశ్, మహేశ్ బాబు హీరోలుగా నటించిన 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' సినిమాలోని పాపులర్ డైలాగ్. తన మనవళ్ళను ఉద్దేశించి వాళ్ళ బామ్మగా నటించిన రోహిణీ హట్టంగడి ఈ డైలాగ్ చెబుతుంటుంది. ఆ తర్వాత ఏ ఇద్దరిని పోల్చాల్సి వచ్చినా 'సరిపోయారు ఇద్దరూ' అనడం పరిపాటిగా మారిపోయింది. సతీశ్ వేగేశ్న ఇప్పుడీ సినిమాకు ఇదే టైటిల్ ను ఖరారు చేశారు. వినాయక చవితి సందర్భంగా ప్రచారానికి శ్రీకారం చుట్టారు. అయితే సినిమాను ఎప్పుడు జనం ముందుకు తీసుకొస్తారనేది తెలియాల్సి ఉంది.







## ఆసక్తి కలిగిస్తోన్న తేది

కాలగమనంలో ప్రతి తేదీకి ఓ చరిత్ర ఉంటుంది. సెప్టెంబర్ 24వ తేదీ అనగానే 'మార్స్ ఆర్బిట్'లోకి ఇండియా ప్రవేశించడం ఓ హిస్టరీ. సినిమాల విషయానికి వస్తే – 1971లో ఆ తేదీ ఓ స్టార్ ప్రొడ్యూసర్ ను నిలిపింది. 2003లో మెగాస్టార్ కు మరపురాని విజయాన్ని అందించింది. ఇప్పుడు అదే తేదీన నాని 'ద ప్యారడైజ్' వస్తోంది.

**ఇంట్రెస్టింగ్ గా ఉంది కదూ...!**

**'ప్రేమనగర్' వెలసిన రోజు...**

వాస్తవానికి ఏ ప్రొడ్యూసర్ అయినా తమ సినిమాకు ఫ్రైడే రిలీజ్ ను ఎంచుకుంటూ ఉంటారు. అయితే కొందరు తమకు అచ్చివచ్చిన సంఖ్యను బట్టి సినిమాలను రిలీజ్ చేస్తూ ఉంటారు.ఆ తీరునే ఇప్పుడు నాని హీరోగా తెరకెక్కిన 'ద ప్యారడైజ్'ను విడుదల చేస్తున్నారని చెప్పవచ్చు. సెప్టెంబర్ 24వ తేదీన ఈ చిత్రం జనం ముందుకు వస్తోంది. ఆ రోజు గురువారం. భారీ వ్యయంతో రూపొందిన నాని తొలి చిత్రం కాబట్టి శుక్రవారం కంటే ఓ రోజు ముందుగానే 'ద ప్యారడైజ్'ను రిలీజ్ చేస్తున్నారని టాక్. అయితే టాలీవుడ్ లో సెప్టెంబర్ 24వ తేదీకి ఓ ప్రత్యేకత ఉంది. 1971లో సురేశ్ ప్రొడక్షన్స్ నిర్మించిన నవలా చిత్రం 'ప్రేమనగర్' అదే రోజున విడుదలై విజయవిహారం చేసింది. అప్పట్లో 'ప్రేమనగర్' చిత్రాన్ని భారీ వ్యయంతో నిర్మించారు డి.రామానాయుడు. ఆ సినిమా రిజల్ట్ ను బట్టి చిత్రసీమలో ఉండాలో లేదో తేలిపోతుందని రామానాయుడు భావించారు. ఆ సినిమా హిట్ అయితే చిత్రసీమలో కొనసాగాలని, లేని పక్షంలో ఏదైనా వ్యాపారం చేసుకోవాలని నాయుడు అనుకున్నారు. అయితే 'ప్రేమనగర్' సినిమా అనూహ్య విజయం సాధించింది...దాంతో రామానాయుడు చిత్రసీమలోనే కొనసాగారు. తరువాత అనేక విజయవంతమైన చిత్రాలు నిర్మించి 'స్టార్ ప్రొడ్యూసర్' అనిపించుకున్నారు... గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లోనూ స్థానం సంపాదించారు.

**చిరంజీవి ఫ్యాన్స్ కూ గుర్తుండే రోజు...**

'ప్రేమనగర్' రిలీజైన 10 ఏళ్ళకు అదే తేదీన రామానాయుడు 'ప్రేమమందిరం' చిత్రాన్ని రిలీజ్ చేశారు. 'ప్రేమనగర్' హీరో ఏయన్నార్ తోనే 'ప్రేమమందిరం' తెరకెక్కింది. దాసరి నారాయణరావు దర్శకత్వంలో రూపొందిన 'ప్రేమమందిరం' 1981 సెప్టెంబర్ 24న విడుదలైంది. అయితే 'ప్రేమనగర్' పదేళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా రిలీజైన 'ప్రేమమందిరం' అలరించలేకపోయింది. దీన్ని బట్టి తేదీలో ఏముంది? అనే అనుమానాలు రావచ్చు. అదే తేదీన 2003లో చిరంజీవి హీరోగా వి.వి.వినాయక్ దర్శకత్వంలో మధు నిర్మించిన 'ఠాగూర్' రిలీజయింది. ఈ మూవీ ఘనవిజయం సాధించి దాదాపు 190కి పైగా కేంద్రాలలో శతదినోత్సవం చూసింది. చిరంజీవి కెరీర్ లో ఇప్పటికీ అత్యధిక కేంద్రాలలో శతదినోత్సవం జరుపుకున్న చిత్రంగా 'ఠాగూర్' నిలచింది. చిత్ర నిర్మాత మధు పేరు ముందు 'ఠాగూర్' స్థానం సంపాదించింది. అందువల్ల సెప్టెంబర్ 24వ తేదీ అనేది చిరంజీవి ఫ్యాన్స్ కు కూడా మరపురాని తేదీగా మిగిలిపోయింది. 2014 సెప్టెంబర్ 24వ తేదీన భారతదేశం 'మార్స్ ఆర్బిట్ మిషన్'ను మార్స్ కక్షలోకి విజయవంతంగా ప్రయోగించింది. అలా మార్స్ ఆర్బిట్ లో ప్రవేశించిన మొదటి ఆసియా దేశంగా భారత్ చరిత్రలో నిలచింది. దాంతో ఎంతోమందికీ సెప్టెంబర్ 24వ తేదీ గుర్తుండి పోయింది. అదే తేదీన ఇప్పుడు నాని 'ద ప్యారడైజ్' విడుదల కానుంది. అందువల్ల సినీ ఫ్యాన్స్ లో ఆసక్తి చోటు చేసుకుంది...

**ఏమవుతుందో మరి...!**

యాభై ఐదేళ్ళ క్రితం 'ప్రేమనగర్' ఘనవిజయం, నలభై ఐదేళ్ళ నాటి 'ప్రేమమందిరం' నిరాశ, ఇరవై మూడేళ్ళ నాటి 'ఠాగూర్' అఖండ విజయం, పుష్కరం నాటి 'మార్స్ ఆర్బిట్' గ్రాండ్ సక్సెస్– ఇవన్నీ పరిశీలిస్తే సెప్టెంబర్ 24కు లక్ పాలు ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తోంది. ఇదే తేదీన ఇప్పుడు 'ద ప్యారడైజ్' ప్రేక్షకుల ముందుకు వస్తోంది... ఈ తేదీని ఎంచుకున్న హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, నిర్మాత సుధాకర్ చెరుకూరి ఏ స్థాయి సక్సెస్ అందుకుంటారో చూడాలి...




OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085